ANN తెలుగు

Follow: @ANNTELUGU

12-04-2026

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 105 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ఏడేళ్ల సుదీర్ఘ విరామం.. భారత్‌కు చేరిన ఇరాన్ చమురు

### ఇంధన భద్రతలో సరికొత్త వ్యూహానికి శ్రీకారం!

20 లక్షల బ్యారెళ్ల ముడి చమురుతో ఇరాన్ నౌకలు!

ఇరాన్‌తో మళ్లీ చిగురించిన బంధం

**ఢిల్లీ, మహా:** ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, చమురు సరఫరాలో ఏర్పడుతున్న ఆటంకాల మధ్య భారత్ తన ఇంధన భద్రతను కాపాడుకునేందుకు అత్యంత సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకుంది. గత ఏడేళ్లుగా మూతపడి ఉన్న ఇరాన్ చమురు మార్గాన్ని మళ్లీ తెరిచింది. శనివారం అందిన సమాచారం ప్రకారం, సుమారు 20 లక్షల బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురు భారత్ తీరానికి చేరుకుంది. 2019లో అప్పటి అమెరికా ప్రభుత్వం విధించిన కఠిన ఆంక్షల నేపథ్యంలో భారత్ తన పాత మిత్రదేశమైన ఇరాన్ నుంచి చమురు దిగుమతులను పూర్తిగా నిలిపివేసింది. అయితే, మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా, తన ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకూడదన్న గట్టి సంకల్పంతో భారత్ ఈ అడుగు వేసింది. భారత్ తన ఇంధన వనరులను విభిన్నం చేసుకోవడంలో ఎంతటి పట్టుదలతో ఉందో అర్థమవుతుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సమయంలో పాశ్చాత్య దేశాల ఆంక్షలను పక్కన పెట్టి మరీ రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకున్న భారత్, ఇప్పుడు అదే బాటలో ఇరాన్‌ను కూడా తన జాబితాలోకి చేర్చుకుంది. దీనివల్ల మధ్యప్రాచ్యంలో కేవలం కొన్ని దేశాలపైనే ఆధారపడాల్సిన అవసరం తప్పడమే కాకుండా, తక్కువ ధరకు చమురు లభించే అవకాశం ఉంటుంది.

మిగతా 2లో

టాప్ న్యూస్

## హర్మూజ్ జలసంధిని క్లియర్ చేస్తున్నాం

- ట్రంప్ కీలక ప్రకటన



02

## ఒక్క మెసేజ్‌తో ఇంటర్ రిజల్ట్స్

- మీసేవ వినూత్న ప్రయోగం
- వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా ఇంటర్ మార్కుల వివరాలు
- తెలంగాణ విద్యాశాఖ కీలక నిర్ణయం

02

## ఫ్యూచర్ సిటీ వెనుక భారీ భూకుంభకోణం

- రేవంత్ రెడ్డిది 'చరిత్రహీనుడి' ప్రస్థానం
- అధికార గర్వంతో విర్రవీగితే ప్రజలే బుద్ధి చెబుతారు
- వచ్చే 50 ఏళ్లు కాంగ్రెస్‌కు ప్రతిపక్షమే గతి
- భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఫైర్



02






## ఎఎన్ఎన్‌కు బండారు దత్తాత్రేయ అభినందనలు

ఎఎన్ఎన్ ఛానల్ మహా పత్రిక ఆధ్వర్యంలో డాక్టర్ అవార్డ్స్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, డాక్టర్లకు అవార్డులు ఇవ్వడం అద్భుతమైన విషయమన్నారు. దేశ ఆర్థికవ్యవస్థను ముందుకు తీసుకెళ్ళేది బిజినెస్ లీడర్సేనని, ఈ అవార్డుల వేడుకద్వారా ఒక స్ఫూర్తి బయటకు వెళ్తుందన్నారు. మినా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి తో పలు ఆస్పత్రుల యాజమాన్యాలు, డాక్టర్లను అభినందించారు. పెద్ద సంఖ్యలో డాక్టర్లు, బిజినెస్ లీడర్లు కుటుంబ సభ్యులతో హాజరుకాగా కార్యక్రమం కనులపండుగగా జరిగింది. పత్తిపాడు జిల్లా మాజీ ఎమ్మెల్యే లేటు జోగిరాజు చేసిన సేవలకు గుర్తింపుగా సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డును ఎఎన్ఎన్ ప్రకటించగా, వారి కుటుంబసభ్యులు స్వీకరించారు. ఈ సందర్భంగా జోగిరాజు సేవల ఏవీ భావోద్వేగానికి గురిచేసింది. బెస్ట్ ఎన్ఆర్ఐ గా కాసర్ల నాగేందర్ రెడ్డికి అవార్డు ప్రకటించగా, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేతులమీదుగా స్వీకరించారు.

## కనుల పండుగగా..

# ఏఎన్ఎన్-మహా అవార్డుల వేడుక

### ముఖ్య అతిధులుగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ














- వైద్యరంగంలో భారత్ దూసుకుపోతోందన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- ఏఎన్ఎన్ నూతన డిజిటల్ ఛానల్స్ ను ప్రారంభించిన కేంద్రమంత్రి
- ఏఎన్ఎన్ ప్రయత్నాన్ని అభినందించిన బండారు దత్తాత్రేయ
- డాక్టర్లు, బిజినెస్ లీడర్లకు అవార్డులతో సత్కారం

**హైదరాబాద్ మహా:** ఏఎన్ఎన్ మహా అవార్డుల వేడుక శనివారం సాయంత్రం కనులపండుగగా జరిగింది. లోక్ భవన్ రోడ్ లోని కత్రియా హోటల్ లో వైభవంగా జరిగిన వేడుకకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిధులుగా హాజరుకాగా, ఈ సందర్భంగా వివిధ రంగాల్లో అద్భుత సేవలందిస్తూ గుర్తింపు ఆశించని డాక్టర్లకు, పారిశ్రామిక విజయాలు సాధించిన అద్భుత బిజినెస్ లీడర్లకు ఏఎన్ఎన్ అవార్డులతో సత్కరించింది. టీ ఫైబర్ ఎండీ వేణుప్రసాద్ విజన్, శ్రమకు గుర్తింపుగా డిజిటల్ ఇన్‌ఫ్రా విజనరీ అవార్డునిచ్చి సత్కరించింది.

**వైద్యరంగంలో దూసుకుపోతున్న భారత్ - కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

వైద్యరంగంలో భారత్ ప్రపంచానికే దిక్సూచిలా



ఉందని, దేశంలోని ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఉండాలని కేంద్రప్రభుత్వం ఆలోచించి మెడికల్ కళాశాలలు ఏర్పాటుచేస్తున్నదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. భారత్ లో ఉన్న సౌకర్యాలకు ఇపుడు ఇతరదేశాల పేషెంట్లే అత్యధికంగా భారత్ కు ట్రీట్‌మెంట్ కోసం మనకు వస్తున్నారన్నారు. వైద్యరంగంలో విశిష్ట సేవలందిస్తున్నప్రముఖులకు, వ్యాపారరంగంలో విశేష సేవలందించిన ప్రముఖులకు అవార్డులు ఇవ్వడం సంతోషకరమన్నారు. హెల్త్ విషయంలో ఇపుడు ప్రజల్లో ఎంతో చైతన్యం వచ్చిందన్నారు.

### నూతన డిజిటల్ ఛానల్స్ ప్రారంభం

ఐదు నూతన డిజిటల్ ఛానల్స్ ఎఎన్ఎన్ భక్తి, ఎఎన్ఎన్ హెల్త్, ఎఎన్ఎన్ విద్య, ఎఎన్ఎన్ బిజినెస్, ఎఎన్ఎన్ ఎంటర్ టైన్ మెంట్ ఛానల్స్ ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. డిజిటల్ యుగంలో రంగాలవారీగా ఛానల్స్ ప్రారంభించడం అభినందనీయమన్నారు.

## దేశంలో జమిలి నగారా..

- ఎన్నికల ముహూర్తం ఖరారు దిశగా కేంద్రం
- 2027 నవంబర్ లేదా 2028 ఫిబ్రవరిలో..
- న్యాయ నిపుణులతో మంతనాలు పూర్తి..
- రాజ్యాంగ సవరణల దిశగా అడుగులు వేస్తున్న మోదీ సర్కార్



**ఢిల్లీ , మహా:** భారతదేశ ఎన్నికల చరిత్రలో ఒక భారీ విప్లవాత్మక మార్పుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. దశాబ్దాలుగా చర్చలకే పరిమితమైన 'ఒకే దేశం ఒకే ఎన్నిక' (జమిలి ఎన్నికలు) విధానాన్ని అమలు చేసే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, 2027 నవంబర్ లేదా 2028 ఫిబ్రవరి నాటికి దేశవ్యాప్తంగా లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అత్యున్నతస్థాయి వ్యూహరచన చేస్తూ, దీనికి ఎదురయ్యే న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చలు జరుపుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలు, ఉన్నతాధికారుల భేటీలు గమనిస్తుంటే, జమిలి ఎన్నికల విషయంలో కేంద్రం వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. జమిలి ఎన్నికల నిర్వహణ అనేది కేవలం ఒక నిర్ణయం మాత్రమే కాదు, అది భారత రాజ్యాంగ వ్యవస్థలో చేయాల్సిన భారీ మార్పు.

మిగతా 2లో

## నీలిరంగుతో కవిత కొత్త పార్టీ

### సామాజిక తెలంగాణే పార్టీ ఎజెండా

### ఏప్రిల్ 25న పార్టీ ఆవిర్భావం.. జెండాపై 'నీలి' ముద్ర ఖాయం



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర రాజకీయ యవనికపై తనదైన ముద్ర వేసేందుకు కల్వకుంట్ల కవిత సిద్ధమవుతున్నారు. తాను ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీ రూపరేఖలకు సంబంధించి అత్యంత కీలకమైన అంశాన్ని ఆమె శనివారం సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. కొత్త పార్టీ జెండా మరియు ఎజెండాలో 'నీలిరంగు' ప్రధాన భూమిక పోషించబోతున్నట్లు ఆమె స్పష్టం చేశారు. కేవలం రంగుగానే కాకుండా, తమ పార్టీకి ఉండబోయే స్పష్టమైన విజన్‌కు, మాట ఇస్తే కట్టుబడి ఉండే నమ్మకత్వానికి ఈ నీలిరంగు సంకేతమని ఆమె వివరించారు. 'కలర్ థియరీ' అనే హాష్‌ట్యాగ్‌తో ఆమె చేసిన ఈ పోస్ట్,

మిగతా 2లో



## కుప్పడం సొగసు.. ఎరుపు జరీ అంచు

- 'ఇందిరమ్మ' చీరల రూపకల్పన పూర్తి!
- కోటి మంది మహిళలకు సర్కార్ కానుక
- డిజైన్‌ను స్వయంగా ఎంపిక చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- టెస్కోకు రూ. 450 కోట్ల ఆర్డర్ ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, మహా: రాష్ట్రంలోని కోటి మంది మహిళా సోదరీమణుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ చీరల' పంపిణీ కార్యక్రమం ముందడుగు వేసింది. మహిళల అభిరుచులకు అనుగుణంగా, అత్యంత నాణ్యమైన ప్రమాణాలతో ఈ చీరలను

మిగతా 2లో

# ఫ్యూచర్ సిటీ వెనుక భారీ భూకుంభకోణం

## రేవంత్ రెడ్డిది చరిత్రహీనుడి ప్రస్థానం

**అధికార గర్వంతో విర్రవీగితే ప్రజలే బుద్ధి చెబుతారు.. వచ్చే 50 ఏళ్లు కాంగ్రెస్‌కు ప్రతిపక్షమే గతి**

**భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఫైర్**

**ఇబ్రహీంపట్నం,మహా.**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత అహంకారంపై భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు నిప్పులు చెరిగారు. శనివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన నూతన బిఆర్ఎస్ సర్పంచులు, కౌన్సిలర్ల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగిస్తూ, రేవంత్ రెడ్డి పాలనను అత్యంత తీవ్రమైన పదజాలంతో విమర్శించారు. అధికారం అనేది ఎవరికీ శాశ్వతం కాదని, ప్రస్తుత ముఖ్యమంత్రి తనకున్న పదవిని చూసుకొని గర్వంతో ఊగిపోతున్నారని, ఆ అహంకారానికి తెలంగాణ సమాజమే త్వరలో దీటైన సమాధానం చెబుతుందని హెచ్చరించారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ సాగిస్తున్న ఈ పాలన రేవంత్ రెడ్డిని ఒక చరిత్రహీనుడిగా మిగిలిపోయేలా చేస్తుందని, తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి రావడానికి మరో 50 ఏళ్లు పడుతుందని కేటీఆర్ రాజకీయ విశ్లేషణ చేశారు.ప్రస్తుత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న 'ఫ్యూచర్ సిటీ' లేదా 'ఫోర్త్ సిటీ' ప్రాజెక్టు వెనుక ఒక భారీ కుట్ర దాగి ఉందని కేటీఆర్ ఆరోపించారు. రాజకీయ భవిష్యత్తు లేని రేవంత్ రెడ్డి, కృత్రిమ మేధ (AI) సృష్టించిన గ్రాఫిక్స్ చిత్రాలను చూపిస్తూ ప్రజలను భ్రమల్లో ముంచుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ ఫోర్త్ సిటీ అనేది ప్రజల అభివృద్ధి కోసం కాదని, కేవలం ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు, ఆయన అనుచరులకు వేల



కోట్ల విలువైన భూములను కట్టబెట్టేందుకు పన్నిన ఒక పెద్ద డ్రామా అని ఆయన ధ్వజమెత్తారు. నిషేధిత భూముల జాబితాను అడ్డం పెట్టుకొని బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తెరలేపారని, పేదల నుంచి భూములను బలవంతంగా గుంజుకుంటున్న తీరు అరాచకానికి పరాకాష్ట అని మండిపడ్డారు. ఉన్న హైదరాబాద్ నగరాన్నే సరిగ్గా నిర్వహించలేని ముఖ్యమంత్రి, దోమల కాటుకు జనం చనిపోతుంటే పట్టించుకోని పాలకుడు, కొత్తగా ఫ్యూచర్ సిటీ కడతానంటే ప్రజలు నవ్వుకుంటున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.ముఖ్యంగా ఫార్మా సిటీ భూముల విషయంలో కాంగ్రెస్ నేతలు ఆడుతున్న ద్వంద్వ నీతిని కేటీఆర్ ఎండగట్టారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం సేకరించిన 14,000 ఎకరాల భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకున్నారని గుర్తు చేశారు. ఆనాడు భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి నేతలు పాదయాత్రలు చేసి రైతులను నమ్మించారని, కానీ అధికారంలోకి వచ్చాక మరో 16,000 ఎకరాల అదనపు భూమిని సేకరిస్తూ రైతుల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులో ఒకలా, బయట ఒకలా మాట్లాడుతున్న ఈ ప్రభుత్వం రైతుల శాపనార్థాలకు గురికాక తప్పదని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి పదవి దిగిపోయిన తర్వాత కనీసం పలకరించే నాథుడు కూడా ఉండదని, తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీని చీత్కరించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన జోస్యం చెప్పారు.ఇబ్రహీంపట్నం మరియు క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో బిఆర్ఎస్ పార్టీ సాధించిన విజయం, కాంగ్రెస్ అరాచకాలపై సాధించిన నైతిక విజయమని కేటీఆర్ అభివర్ణించారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎన్నో అక్రమాలకు పాల్పడిందని, మెజారిటీ కౌన్సిలర్లు గులాబీ జెండా వైపు ఉన్నప్పటికీ కుట్రలతో చైర్మన్ పదవులను దక్కించుకోవాలని చూసిందని విమర్శించారు. అయితే న్యాయం వెన్నంటే నిలిచిన బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు రేవంత్ రెడ్డి అరాచకాలను ఎదిరించి గెలిచారని కొనియాడారు. స్థానిక ఎమ్మెల్యే అరాచకాలను ఎదుర్కొని బలంగా నిలబడిన ప్రశాంత్ రెడ్డి నాయకత్వాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మొండితనం ఉన్న నాయకత్వం ఉంటే ప్రజలు ఖచ్చితంగా ఆదరిస్తారని ఈ ఎన్నికలు నిరూపించాయని పేర్కొన్నారు. అధికారం చూసుకొని విర్రవీగుతున్న రేవంత్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పే ప్రక్రియ ఇక్కడి నుంచే ప్రారంభమైందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు పాల్గొని కేటీఆర్ ప్రసంగానికి సంఘీభావం తెలిపారు.

# ఒక్క మెసేజ్‌తో ఇంటర్ రిజల్ట్స్.. మీసేవ వినూత్న ప్రయోగం

**హైదరాబాద్, మహా:**

రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూసే ఇంటర్మీడియట్ ఫలితాల వెల్లడిలో ఈసారి సరికొత్త విప్లవం రాబోతోంది. ప్రతి ఏటా ఫలితాలు విడుదలైన తరుణంలో అధికారిక వెబ్‌సైట్లు మొరాయించడం, సర్వర్లపై ఒత్తిడి పెరిగి గంటల తరబడి నిరీక్షించాల్సి రావడం సర్వసాధారణం. అయితే, ఈ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపుతూ తెలంగాణ ప్రభుత్వం, మీసేవ విభాగం సంయుక్తంగా ఒక వినూత్న నిర్ణయం తీసుకున్నాయి. ఇకపై విద్యార్థులు తమ అరచేతిలోని స్మార్ట్‌ఫోన్ ద్వారా, అత్యంత ప్రజాదరణ పొందిన వాట్సాప్ వేదికగా నిమిషాల వ్యవధిలో ఫలితాలను పొందేలా అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తెచ్చాయి. రేపు విడుదల కానున్న ఇంటర్ ఫలితాల కోసం విద్యార్థులు ఇంటర్నెట్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా, ఇంట్లోనే కూర్చుని మార్కుల వివరాలను తెలుసుకునే వీలు కల్పించారు.

సాధారణంగా ఫలితాల రోజున విద్యాశాఖ వెబ్‌సైట్లు ట్రాఫిక్ తాకిడిని తట్టుకోలేక స్తంభించిపోతుంటాయి. దీనివల్ల విద్యార్థుల్లో ఒక రకమైన మానసిక ఆందోళన నెలకొంటుంది. ఈ సమస్యను లోతుగా విశ్లేషించిన అధికారులు, సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే వాట్సాప్ చాట్‌బాట్ సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక హెల్ప్‌లైన్ నంబర్‌ను కేటాయించారు. విద్యార్థులు తొలుత 8096 95 8096 అనే నంబర్‌ను తమ మొబైల్ కాంటాక్ట్స్‌లో 'మీసేవ తెలంగాణ' (MeeSeva Telangana) పేరుతో భద్రపరుచుకోవాలి. అనంతరం వాట్సాప్‌ను తెరిచి, ఆ నంబర్‌కు కేవలం 'Hi' అని సందేశం పంపితే చాలు, తక్షణమే మీసేవ చాట్‌బాట్ సేవల ప్రక్రియ ప్రారంభమవుతుంది.

ఈ సాంకేతిక ప్రక్రియలో భాగంగా చాట్‌బాట్ స్పందించిన తర్వాత, విద్యార్థులు 'BIE Exam Result' అని టైప్ చేసి పంపాల్సి ఉంటుంది. ఆ వెంటనే 'Open Service' అనే ఆప్షన్ కనిపిస్తుంది. దానిని క్లిక్ చేయగానే ఒక విండో ఓపెన్ అవుతుంది. అక్కడ విద్యార్థి తన హాల్ టికెట్ లేదా రోల్ నంబర్‌ను నమోదు చేయాలి. ఆపై తాను ప్రథమ సంవత్సరం విద్యార్థా లేక ద్వితీయ సంవత్సరం విద్యార్థా అన్నది ఎంచుకోవాలి. అలాగే స్ట్రీమ్ విభాగంలో జనరల్ లేదా వొకేషనల్ అనే ఆప్షన్లను సెలెక్ట్ చేసుకుని సబ్మిట్ బటన్ నొక్కాలి. ఈ ప్రక్రియ పూర్తయిన మరుక్షణమే సదరు విద్యార్థికి సంబంధించిన పూర్తి ఫలితాలు, సబ్జెక్టుల వారీగా వచ్చిన మార్కుల వివరాలు వాట్సాప్ స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతాయి.డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ చర్య విద్యార్థులకు మరియు గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులకు గొప్ప ఊరటనిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. నెట్ కనెక్టివిటీ తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా వాట్సాప్ సులువుగా పనిచేస్తుంది కాబట్టి, ఫలితాల సేకరణలో జాప్యం జరిగే అవకాశం ఉండదు. విద్యా రంగంలో సాంకేతికతను మేళవించి సామాన్యుడికి సేవలందిస్తున్న తీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. రేపు ఫలితాలు విడుదలైన సమయం నుండి ఈ చాట్‌బాట్ సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు తమ ఫలితాలను చూసుకునే క్రమంలో ఎటువంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలని, సరైన రోల్ నంబర్లను మాత్రమే నమోదు చేయాలని సూచిస్తున్నారు. ఈ వినూత్న ప్రయత్నం విద్యార్థుల ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, పారదర్శకమైన మరియు వేగవంతమైన సేవలందించడంలో మైలురాయిగా నిలవనుంది.

# కుప్పడం సొగసు.. ఎరుపు జరీ అంచు

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించాలని నిశ్చయించిన ప్రభుత్వం, తాజాగా వాటి తుది డిజైన్‌ను ఖరారు చేసింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శనివారం స్వయంగా వివిధ రకాల నమూనాలను పరిశీలించి, ఆకర్షణీయమైన కుప్పడం రంగుతో పాటు ఎరుపు రంగు జరీ బోర్డర్ కలిగిన వెరైటీని ఎంపిక చేశారు. సాంప్రదాయబద్ధంగా ఉంటూనే ఆధునిక హంగులు అద్దుకున్న ఈ చీరలు, రాష్ట్రంలోని సామాన్య మహిళలకు ప్రభుత్వ గౌరవప్రదమైన కానుకగా నిలవనున్నాయి. కేవలం ఒక వస్త్రంగా కాకుండా, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఈ 'ఇందిరమ్మ' చీరలను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ బృహత్తర పథకం ద్వారా కేవలం మహిళలకే కాకుండా, రాష్ట్రంలోని నేతన్నలకు కూడా భారీ ఎత్తున లబ్ధి చేకూరనుంది. చేనేత రంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంస్థ (టెస్కో)కు ప్రభుత్వం భారీ ఆర్డర్‌ను కట్టబెట్టింది. సుమారు కోటి చీరల తయారీ కోసం ప్రభుత్వం ఏకంగా రూ. 450 కోట్ల నిధులను కేటాయించడమే కాకుండా, ఇప్పటికే టెస్కోకు అధికారికంగా ఆర్డర్ జారీ చేసింది. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది నేత కార్మికులకు రాబోయే నెలల్లో నిరంతర పని దొరకడమే కాకుండా, వారి ఆర్థిక స్థితిగతులు గణనీయంగా మెరుగుపడతాయని ప్రభుత్వం ఆశిస్తోంది. గత ప్రభుత్వాల హయాంలో చీరల నాణ్యతపై వచ్చిన విమర్శలను దృష్టిలో పెట్టుకుని, ఈసారి అత్యుత్తమమైన దారం మరియు రంగులను వినియోగించి, మన్నికైన వస్త్రాలను ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

విశ్లేషణాత్మక కోణంలో చూస్తే, ఈ 'ఇందిరమ్మ' చీరల పథకం అటు సంక్షేమానికి, ఇటు ఉపాధికి వారధిలా నిలుస్తోంది. ఒకేసారి కోటి చీరలను పంపిణీ చేయడం ద్వారా రాష్ట్రంలోని ప్రతి పేద ఇంటికీ ప్రభుత్వ మద్దతు అందుతుందన్నది ముఖ్యమంత్రి ఆకాంక్ష. ముఖ్యంగా కుప్పడం షేడ్ మరియు ఎరుపు జరీ అంచు కలిగిన డిజైన్‌ను ఎంపిక చేయడం వెనుక మహిళల సెంటిమెంట్‌ను, వారి ప్రాధాన్యతలను గౌరవించినట్లు కనిపిస్తోంది. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, ఎక్కడా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా టెస్కో ద్వారానే ఈ భారీ ఆర్డర్‌ను నిర్వహించడం వల్ల నేతన్నలకు గరిష్ట ప్రయోజనం చేకూరనుంది. ఇది కేవలం ఎన్నికల హామీని నెరవేర్చడమే కాకుండా, రాష్ట్ర పారిశ్రామిక వృద్ధిలో చేనేత రంగాన్ని మళ్లీ అగ్రపథాన నిలబెట్టే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

మానవీయ కోణంలో చూస్తే, పేద మహిళల కళ్లలో ఆనందం నింపేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయం. పండగ సంబరాల్లో కొత్త వస్త్రాలు ధరించడం అనేది సామాన్యుల సంతోషంలో ఒక ప్రధాన భాగం. ఆ సంతోషాన్ని మరింత రెట్టింపు చేసేలా, ముఖ్యమంత్రి స్వయంగా శ్రద్ధ తీసుకుని డిజైన్‌ను ఖరారు చేయడం విశేషం. ప్రస్తుతం ఉత్పత్తి ప్రక్రియను వేగవంతం చేసి, రాబోయే పండగ సీజన్ నాటికి లబ్ధిదారులందరికీ ఈ చీరలు అందేలా పౌరసరఫరాల శాఖ మరియు టెస్కో యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తున్నాయి. పారదర్శకమైన పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి మహిళకూ ఈ కానుకను చేరవేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ పథకం విజయవంతమైతే, తెలంగాణలో మహిళా సాధికారత మరియు చేనేత అభ్యున్నతి దిశగా ఒక నూతన అధ్యాయం ప్రారంభం కానుంది.

# ఏడేళ్ల సుదీర్ఘ విరామం.. భారత్‌కు చేరిన ఇరాన్ చమురు

(మొదటిపేజీ తరువాయి)

ఇరాన్ నుంచి లభించే ఈ చమురు భారత చమురు కంపెనీలకు ఆర్థికంగా ఎంతో ఊరటనిస్తుంది. రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు, అనుకూలమైన చెల్లింపు విధానాలు ఉండటం వల్ల దేశీయంగా ఇంధన ధరలను అదుపులో ఉంచేందుకు ఇది ఒక గొప్ప అవకాశంగా మారనుంది. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఎప్పుడు ఎలా మారుతాయో తెలియని అనిశ్చితి నెలకొన్న తరుణంలో ఇరాన్ వంటి దేశాలతో సంబంధాలు మళ్లీ బలపడటం భారత్‌కు ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. ప్రపంచం మొత్తం ఆంక్షల గురించి మాట్లాడుతున్నా, భారత్ మాత్రం తన 140 కోట్ల జనాభా అవసరాలను, పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ వేగాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. ఇది కేవలం ఇంధన సరఫరాకు సంబంధించింది మాత్రమే కాదు, అంతర్జాతీయ వేదికపై భారత్ ఒక స్వతంత్ర శక్తిగా ఎదిగిందనడానికి ఒక నిదర్శనం. అమెరికా లేదా ఇతర శక్తివంతమైన దేశాల నిర్ణయాలకు లోబడకుండా, దేశ ప్రయోజనాలే పరమావధిగా అడుగులు వేస్తున్న భారత్ దౌత్య నీతికి ఇది గెలుపుగా చెప్పవచ్చు. చమురు ధరలు తగ్గడం లేదా స్థిరంగా ఉండటం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉంటాయి, ఇది నేరుగా సామాన్య మానవుడి జేబుపై ప్రభావం చూపుతుంది. ఏడేళ్ల తర్వాత మళ్లీ ఇరాన్ చమురు భారత్‌కు చేరుకోవడం వల్ల రాబోయే రోజుల్లో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ఇరాన్‌తో మళ్లీ చిగురించిన ఈ ఇంధన బంధం కేవలం చమురుకే పరిమితం కాకుండా, చాబహార్ ఓడరేవు వంటి ఇతర వ్యూహాత్మక ప్రాజెక్టులకు కూడా ఊతం ఇస్తుందని నిపుణులు ఆశిస్తున్నారు.

# దేశంలో జమిలి నగారా..

(మొదటిపేజీ తరువాయి)

దీనిపై మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ఇప్పటికే సమగ్ర నివేదికను సమర్పించిన నేపథ్యంలో, ఇప్పుడు అమలు ప్రక్రియపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాజ్యాంగంలోని పలు అధికరణలను సవరించడం ద్వారా రాష్ట్రాల అసెంబ్లీల కాలపరిమితిని లోక్‌సభ గడువుతో సమన్వయం చేసేందుకు కసరత్తు జరుగుతోంది. దీనికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే ప్రముఖ న్యాయవాదులు, రాజ్యాంగ నిపుణులతో చర్చలు జరిపిందని, ఏఏ చట్టాలను మార్చాలి, విపక్షాల అభ్యంతరాలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై ఒక రోడ్ మ్యాప్ సిద్ధం చేసినట్లు సమాచారం. 2027 చివరలో లేదా 2028 ప్రారంభంలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో దేశం ప్రతి ఏటా ఎన్నికల కోడ్ , రాజకీయ రొంపిలో చిక్కుకోకుండా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. జమిలి ఎన్నికల అవశ్యకతను కేంద్రం ప్రధానంగా 'ప్రజాధనం ఆదా' , 'నిరంతర అభివృద్ధి' అనే కోణాల్లో వివరిస్తోంది. దేశంలో తరచూ ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరుగుతూ ఉండటం వల్ల భారీగా ఖర్చు కావడమే కాకుండా, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల నియమావళి) కారణంగా అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోందని ప్రభుత్వం వాదిస్తోంది. ఈ సమస్యకు పరిష్కారంగానే జమిలి విధానాన్ని తీసుకురావాలని సంకల్పించింది. అయితే, రాష్ట్రాల హక్కుల విషయంలో విపక్షాల నుంచి వస్తున్న విమర్శలను కూడా పరిగణనలోకి తీసుకుని, అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో రాజ్యాంగ సవరణలు తీసుకురావాలని చూస్తోంది. న్యాయ నిపుణుల సూచనల మేరకు, ఒకవేళ ఏదైనా రాష్ట్రంలో ప్రభుత్వం పడిపోతే, తదుపరి ఎన్నికల వరకు అక్కడ ఉండే మధ్యంతర ఏర్పాట్లపై కూడా స్పష్టతనివ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది.ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను గమనిస్తే, రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో జమిలి ఎన్నికలకు సంబంధించి కీలకమైన బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. 2027 నవంబర్ నాటికి దేశంలోని మెజారిటీ రాష్ట్రాల అసెంబ్లీల గడువును ఒక క్రమపద్ధతిలోకి తీసుకురావడం ద్వారా ఎన్నికల నిర్వహణ సులభతరం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం అమలులోకి వస్తే, దేశవ్యాప్తంగా ఎన్నికల ఖర్చు తగ్గడమే కాకుండా, ఐదేళ్ల పాటు ప్రభుత్వాలు నిరంతరాయంగా పాలనపై దృష్టి పెట్టే వీలుంటుంది. ఢిల్లీ వర్గాల్లో వినిపిస్తున్న వార్తల ప్రకారం, కేంద్రం ఈ విషయంలో ఎంతో పట్టుదలతో ఉంది , వీలైనంత త్వరగా దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ మార్పు ఏ విధమైన ఫలితాలను ఇస్తుందనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది.



# హర్మ్యూజ్ జలసంధిని క్లియర్ చేస్తున్నాం: ట్రంప్

**మహా:**ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా అమెరికాకు చెందిన రెండు యుద్ధనౌకలు హర్మ్యూజ్ జలసంధిలోకి ప్రవేశించాయి. ఈ కీలకమైన జలమార్గాన్ని క్లియర్ చేసే ప్రక్రియను ప్రారంభించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైన ఈ ఘర్షణ నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా నేవీకి చెందిన గైడెడ్‌మిస్సైల్ డిస్ట్రాయర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జలసంధిని దాటినట్టు వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. అయితే, ఈ ఆపరేషన్ కోసం టెహ్రాన్ అధికారులతో ఎలాంటి సమన్వయం చేసుకోలేదని యాక్సియోస్ అనే మరో మీడియా సంస్థ తెలిపింది. ఈ అంశంపై తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ట్రంప్ స్పందించారు. "మేము ఇప్పుడు హర్మ్యూజ్ జలసంధిని క్లియర్ చేసే ప్రక్రియను ప్రారంభిస్తున్నాం" అని ఆయన తెలిపారు. చైనా, జపాన్, ఫ్రాన్స్ వంటి దేశాలకు ఇది మేలు చేస్తుందని, ఆ దేశాలకు ఈ పని చేసే ధైర్యం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఘర్షణలో ఇరాన్ భారీగా నష్టపోతోందని ట్రంప్ అన్నారు. అయితే, ఇరాన్ సముద్రంలో అమర్చిన మైన్‌ల వల్ల ఇప్పటికీ ప్రమాదం పొంచి ఉందని అంగీకరించారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించినప్పటి నుంచి ఇరాన్ ఈ కీలక జలమార్గాన్ని దాదాపుగా దిగ్బంధించింది. ప్రపంచంలోని ముడిచమురు రవాణాలో ఐదో వంతు ఈ మార్గం గుండానే జరుగుతుంది. ఇదిలా ఉంటే.. ఈ ఘర్షణకు ముగింపు పలికేందుకు ఇరు దేశాల సీనియర్ అధికారులు పాకిస్థాన్‌లో నేడు చర్చలు ప్రారంభించినట్టు ఇరాన్ మీడియా వెల్లడించింది.

# డీజిల్, విమాన ఇంధనంపై సుంకాల పెంపు

**ఢిల్లీ, మహా:** అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు మరియు చమురు శుద్ధి సంస్థల లాభాల మార్జిన్లను నిశితంగా పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వం, దేశీయ ఇంధన రంగంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. శనివారం వెలువడిన తాజా ఉత్తర్వుల ప్రకారం, దేశం నుంచి ఎగుమతి అయ్యే డీజిల్ మరియు విమాన ఇంధనం పై ఎగుమతి సుంకాలను గణనీయంగా పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అంతర్జాతీయంగా చమురు ధరలు మారుతున్న నేపథ్యంలో దేశీయ ప్రయోజనాలను కాపాడేందుకు మరియు అదనపు లాభాలపై పన్ను వసూలు చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పెంచిన ధరల ప్రకారం, డీజిల్ ఎగుమతి సుంకాన్ని లీటరుకు రూ. 5.5 కు పెంచగా, విమాన ఇంధనంపై ఈ సుంకాన్ని లీటరుకు రూ. 4.2 కు పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే, పెట్రోల్ ఎగుమతులపై విధించే సుంకంలో మాత్రం ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయకపోవడం గమనార్హం. ప్రభుత్వం ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్వహించే ఈ 'విండ్‌ఫాల్ ట్యాక్స్' సమీక్షలో భాగంగానే ఈ పెంపు చోటుచేసుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరిగినప్పుడు, దేశీయ చమురు శుద్ధి సంస్థలు ఎగుమతుల ద్వారా అసాధారణ లాభాలను ఆర్జిస్తాయి. ఈ లాభాల్లో వాటాను పన్ను రూపంలో పొందేందుకు కేంద్రం 2022 జూలై నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తోంది. తాజా పెంపు వల్ల రిలయన్స్ ఇండస్ట్రీస్, నాయరా ఎనర్జీ వంటి ప్రైవేట్ రంగ చమురు సంస్థలపై కొంత ఆర్థిక భారం పడే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా డీజిల్ , ఏటీఎఫ్ డిమాండ్ స్థిరంగా ఉండటంతో, శుద్ధి మార్జిన్లు పెరిగాయని గుర్తించిన ప్రభుత్వం, ఈ అదనపు ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు మళ్లించే వ్యూహంతో అడుగులు వేస్తోంది.

# నీలిరంగుతో కవిత కొత్త పార్టీ

(మొదటిపేజీ తరువాయి)

రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించబోయే సామాజిక గమనాన్ని సూచిస్తోంది. అట్టడుగు వర్గాల సంక్షేమమే ధ్యేయంగా తన రాజకీయ ప్రయాణం సాగబోతోందని ఈ నిర్ణయం ద్వారా ఆమె పరోక్షంగా వెల్లడించారు. కవిత తన పార్టీకి రంగుల ఎంపిక విషయంలో ఎంతో లోతైన అధ్యయనం చేసినట్లు కనిపిస్తోంది. ఇప్పటివరకు ఆమె నేతృత్వం వహించిన 'తెలంగాణ జాగృతి' సంస్థలోని ఆకుపచ్చ రంగు పచ్చదనానికి, వ్యవసాయానికి , రైతు సంక్షేమానికి నిదర్శనంగా ఉండేది. ఇప్పుడు కొత్తగా చేరబోయే నీలిరంగు బడుగు, బలహీన వర్గాల వికాసానికి, వారి సామాజిక సమున్నతికి సూచిక అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అంటే, రైతాంగంతో పాటు బహుజన వర్గాలను ఏకతాటిపైకి తెచ్చి, ఒక సమగ్ర సామాజిక తెలంగాణను నిర్మించడమే తన లక్ష్యమని ఆమె చాటుకుంటున్నారు. 'సామాజిక తెలంగాణ సర్వోదయ వికాసం' అనే నినాదంతో, 'తెలంగాణ ఫస్ట్' సిద్ధాంతాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆమె ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.పార్టీ ఆవిర్భావం , ఏర్పాట్ల విషయంలో కవిత బృందం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఈ నెల 25వ తేదీన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వేషన్ వేదికగా ఈ నూతన రాజకీయ శక్తి ఆవిర్భవించబోతోంది. శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా నిజామాబాద్‌లో ఆమె చేసిన ప్రకటన ఇప్పటికే రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించింది. ప్రస్తుతం వివిధ రంగాల ప్రముఖులు, మేధావులు మరియు సామాజిక కార్యకర్తలతో ఆమె వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ పేరు, వి



ధివిధానాలు , భవిష్యత్ కార్యాచరణను ఆవిర్భావ సభ రోజే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. తన రాజకీయ పునరాగమనాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కవిత, ఈ పార్టీ ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో ఏ విధమైన మార్పులు తీసుకువస్తారోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కవిత ఏర్పాటు చేయబోయే పార్టీ రాష్ట్రంలోని ఇతర పార్టీలకు గట్టి పోటీనిచ్చేలా కనిపిస్తోంది. ముఖ్యంగా బలహీన వర్గాల ఓటు బ్యాంకును లక్ష్యంగా చేసుకుని 'నీలిరంగు'ను ఎంచుకోవడం వెనుక బలమైన రాజకీయ చతురత దాగి ఉంది. జెండాలో పచ్చదనం , నీలిమ కలయిక వల్ల రైతులు, వెనుకబడిన తరగతుల సమ్మేళనంగా పార్టీ రూపుదిద్దుకోనుంది. ఏప్రిల్ 25న జరగబోయే ఈ ఆవిర్భావ వేడుక తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక కొత్త అధ్యయనానికి నాంది పలుకుతుందని జాగృతి వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. రాజధాని నగరం పొలిమేరల్లో జరగబోయే ఈ భారీ బహిరంగ సభ ద్వారా తన రాజకీయ సత్తాను చాటిచెప్పేందుకు కవిత సర్వం సిద్ధం చేసుకున్నారు.

# గ్లోబల్ వార్మింగ్ విలయం..

## నిప్పుల కొలిమిలా మారుతున్న భూగోళం

**ఐస్‌లాండ్ నుంచి అల్జీరియా వరకు భగభగలాడుతున్న ఉష్ణోగ్రతలు!**

**అల్జీరియాలో 51 డిగ్రీలు దాటిన సెగలు.. మంచు దేశాల్లోనూ వడగాల్పుల సెగ**



**మహా ప్రత్యేకం:**ప్రకృతి తన సమతుల్యతను కోల్పోతే పరిణామాలు ఎంత భయంకరంగా ఉంటాయో చెప్పడానికి ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలే నిదర్శనం. మనిషి స్వార్థం, మితిమీరిన పారిశ్రామికీకరణ మరియు అడవుల నరికివేత ఫలితంగా భూగోళం ఇప్పుడు నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఒకప్పుడు చలికి గజగజ వణికే ఐస్‌లాండ్, నార్వే వంటి దేశాల్లో కూడా ఇప్పుడు వేసవి సెగలు మునుపెన్నడూ లేని విధంగా రికార్డులను తిరగరాస్తున్నాయి. తాజా గణాంకాలను పరిశీలిస్తే, శీతల దేశాల నుంచి ఎడారి ప్రాంతాల వరకు ప్రతిచోటా భానుడి భగభగలు మనిషి సహనాన్ని పరీక్షిస్తున్నాయి. పర్యావరణవేత్తలు దశాబ్దాలుగా చేస్తున్న హెచ్చరికలు ఇప్పుడు అక్షర సత్యాలవుతూ, భూతాపం ఏ స్థాయిలో పెరుగుతుందో కళ్లకు కడుతున్నాయి. ఐస్‌లాండ్‌లో నమోదైన 30.5 డిగ్రీల నుంచి అల్జీరియాలో నమోదైన 51.3 డిగ్రీల వరకు ఉన్న ఈ గణాంకాలు కేవలం సంఖ్యలు మాత్రమే కావు, అవి భూమాత ఆవేదనకు ప్రతిరూపాలు.సాధారణంగా అత్యంత శీతలంగా ఉండే ఐస్‌లాండ్‌లో 30.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం అంటే అది పర్యావరణ విపత్తుకు సంకేతమే. అదేవిధంగా ఐర్లాండ్ (33.3 □C), నార్వే (35.6 □C), ఫిన్లాండ్ (37.2 □C) వంటి దేశాల్లో ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలు దాటడం అక్కడి ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. యూరప్ దేశాల్లో సైతం హీట్ వేవ్స్ పెను విధ్వంసం సృష్టిస్తున్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్ (40.3 □C), జర్మనీ (41.2 □C), ఫ్రాన్స్ (46.0 □C) మరియు ఇటలీలో నమోదైన 48.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఆయా దేశాల చరిత్రలోనే అత్యధికం. ఈ పెరుగుదల కేవలం ఎండలకే పరిమితం కాకుండా గ్లేసియర్లు కరగడం, సముద్ర మట్టాలు పెరగడం వంటి గొలుసుకట్టు సమస్యలకు దారితీస్తోంది. ఆసియా ఖండంలో కూడా పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. దక్షిణ కొరియా (41.0 □C), జపాన్ (41.1 □C) వంటి దేశాలు కూడా నిప్పుల కొలిమిలో చిక్కుకున్నాయి. మన దేశం భారత్ (51.0 □C) తో పాటు అల్జీరియా (51.3 □C), ఆస్ట్రేలియా (50.7 □C), ట్యునీషియా (50.3 □C) వంటి దేశాల్లో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల మార్కును దాటేయడం మానవ మనుగడపై పెను ప్రభావం చూపుతోంది. ఈ స్థాయిలో ఎండలు పెరగడం వల్ల వ్యవసాయ రంగం కుప్పకూలడం, నీటి వనరులు అడుగంటిపోవడం మరియు వడదెబ్బ వల్ల ప్రాణనష్టం జరగడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. మానవీయ కోణంలో ఆలోచిస్తే, ఎండల ధాటికి గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు, నిరుపేదలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. పసిపిల్లలు, వృద్ధులు ఈ తీవ్రమైన ఉష్ణోగ్రతలను తట్టుకోలేక అనారోగ్యాల పాలు కావడం ఆవేదన కలిగిస్తోంది. ప్రకృతిని మనం రక్షించకపోతే, అది మనల్ని దహించివేస్తుందనే సత్యాన్ని ఈ గణాంకాలు పదేపదే గుర్తుచేస్తున్నాయి. ప్రపంచ దేశాలన్నీ ఏకమై కార్బన్ ఉద్గారాలను తగ్గించకపోతే భవిష్యత్తులో ఈ ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. కెనడా వంటి శీతల ప్రాంతంలో కూడా 49.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం ఒక ఊహించని పరిణామం. అభివృద్ధి పేరిట మనం చేస్తున్న విధ్వంసం తిరిగి మనకే శాపంగా మారుతోంది. కేవలం గణాంకాలను చూసి ఆశ్చర్యపోవడం కాకుండా, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాల్సిన సమయం ఆసన్నమైంది. పచ్చదనాన్ని పెంచడం, శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించడం మరియు పర్యావరణ హిత జీవనశైలిని అవలంబించడం ద్వారా మాత్రమే మనం భావి తరాలకు నివాసయోగ్యమైన భూమిని అందించగలం.

### అగ్రరాజ్యాల ఖజానాల కంటే
# మన ఇళ్లలోనే ఎక్కువ బంగారం!

పది దేశాల నిల్వలు ఒకవైపు.. భారత మహిళల నగలు ఒకవైపు.
ప్రపంచ రికార్డులను తిరగరాస్తున్న పసిడి మక్కువ... భారతీయ గృహిణుల వద్ద 25 వేల టన్నుల పసిడి!

**మహా ప్రత్యేకం:** భారతదేశంలో బంగారం అంటే కేవలం ఒక ఆభరణం మాత్రమే కాదు, అది ఒక సెంటిమెంట్, ఒక సామాజిక భద్రత, అంతకు మించి ఒక సంప్రదాయం. ప్రపంచవ్యాప్తంగా అగ్రరాజ్యాలు తమ ఆర్థిక స్థిరత్వం కోసం సెంట్రల్ బ్యాంకుల్లో టన్నుల కొద్దీ బంగారాన్ని నిల్వ చేసుకుంటాయి. అయితే, విస్మయకరమైన విషయం ఏమిటంటే, ప్రపంచంలోని అగ్రగామి 10 దేశాల అధికారిక బంగారు నిల్వలను కలిపినా, భారతీయ మహిళల వద్ద ఉన్న పసిడి నిల్వలతో సరితూగలేకపోతున్నాయి. తాజా గణాంకాల ప్రకారం, భారతీయ మహిళల వద్ద సుమారు *25,488 టన్నుల* బంగారం ఉన్నట్లు అంచనా. ఈ సంఖ్య వినడానికి సామాన్యంగా అనిపించినా, ప్రపంచ ఆర్థిక పటంలో ఇది ఒక పెను సంచలనం. అమెరికా, జర్మనీ, ఇటలీ వంటి దిగ్గజ దేశాల ఖజానాల్లో ఉన్న పసిడి కంటే మన దేశంలోని ఇళ్లలో ఉన్న బంగారమే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉండటం విశేషం.ఈ గణాంకాలను లోతుగా విశ్లేషిస్తే, ప్రపంచంలోనే అత్యధిక బంగారు నిల్వలు కలిగిన అమెరికా వద్ద కేవలం 8,133 టన్నులు మాత్రమే ఉన్నాయి. ఆ తర్వాత స్థానాల్లో ఉన్న జర్మనీ (3,351 టన్నులు), ఇటలీ (2,451 టన్నులు), ఫ్రాన్స్ (2,437 టన్నులు), రష్యా (2,332 టన్నులు), చైనా (2,279 టన్నులు), స్విట్జర్లాండ్ (1,039 టన్నులు), జపాన్ (845 టన్నులు), నెదర్లాండ్స్ (612 టన్నులు), మరియు పోలాండ్ (448 టన్నులు) వంటి దేశాలన్నింటి నిల్వలను కలిపినా, అవి భారతీయ మహిళల వద్ద ఉన్న పసిడి సామ్రాజ్యంలో సగం కూడా ఉండవు. అంటే, ప్రపంచంలోని పది అగ్ర రాజ్యాల ఆర్థిక రక్షణ కవచం కంటే భారతీయ గృహిణుల 'శ్రీధనం' ఎంతో పటిష్టమైనదని అర్థమవుతోంది. దశాబ్దాలుగా మన దేశంలో బంగారంపై ఉన్న నమ్మకం, పెట్టుబడి కంటే ఎక్కువగా ఒక కుటుంబ గౌరవంగా, ఆపత్కాల నిధిగా పరిగణించబడటమే దీనికి ప్రధాన కారణం. భారతీయ మహిళలకు బంగారం కేవలం అలంకారప్రాయమే కాదు, అది వారి ఆర్థిక స్వతంత్రతకు ప్రతీక. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు, కష్టార్జితాన్ని పసిడి రూపంలో దాచుకోవడం భారతీయులకు వెన్నతో పెట్టిన విద్య. ఎన్ని ఆర్థిక సంక్షోభాలు వచ్చినా, స్టాక్ మార్కెట్లు కుప్పకూలినా, తమ వద్ద ఉన్న పసిడి తమను కాపాడుతుందనే నమ్మకం భారతీయ కుటుంబాల్లో ప్రగాఢంగా ఉంటుంది. ఈ 'వ్యక్తిగత ఖజానాలే' భారత ఆర్థిక వ్యవస్థకు ఒక అదృశ్య వెన్నుముకగా నిలుస్తున్నాయి. ప్రపంచ దేశాలు తమ కరెన్సీ విలువను కాపాడుకోవడానికి బంగారాన్ని నిల్వ చేస్తే, భారతీయ మహిళలు తమ కుటుంబాల భవిష్యత్తు కోసం, బిడ్డల పెళ్లిళ్ల కోసం, అత్యవసర అవసరాల కోసం ఈ పసిడిని ఒక భరోసాగా భావిస్తారు. ప్రకారం, దేశంలో ఉన్న ఈ భారీ పసిడి నిల్వలు ఒకవైపు గర్వకారణంగా ఉన్నప్పటికీ, ఇవి ఎక్కువగా ఆభరణాల రూపంలో 'డెడ్ ఇన్వెస్ట్‌మెంట్'గా ఉండిపోవడం గమనార్హం. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న గోల్డ్ మానిటైజేషన్ వంటి పథకాల ద్వారా ఈ బంగారాన్ని ఆర్థిక వ్యవస్థలోకి మళ్లిస్తే, దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఏది ఏమైనా, ప్రపంచ వేదికపై అగ్రరాజ్యాల సరసన భారత్ నిలబడటమే కాకుండా, తన గృహిణుల పసిడి నిల్వలతో అమెరికా, చైనా వంటి దేశాలనే వెనక్కి నెట్టడం గర్వించదగ్గ విషయం. అక్షరాలా పసిడి దేశంగా భారత్ తన పురాతన వైభవాన్ని చాటుకుంటోంది.

## ప్రజా ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాల అమలు

- మండలంలో 2500నూతన రేషన్ కార్డులు మంజూరు
- ఒకే రోజు 452 మందికి కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ
- 400 మంది కి రెండేళ్ల కాలంలో వారసత్వ పట్టాల పంపిణీ
- ఇందిరమ్మ ఇల్లు మొదటి విడతలో మండల వ్యాప్తంగా 675 మందికి లబ్ధి
- నియోజకవర్గ వ్యాప్తంగా 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు
- నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు



**బూర్గంపహాడ్ మహా :** ప్రజా ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాల అమలు చేస్తున్నామని పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల అమలులో ఇప్పటికే ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పంపిణీ, చేపట్టామని అన్నారు. ఆనాటి కాంగ్రెస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో తానే నియోజకవర్గ శాసన సభ్యులుగా ఉన్నానని నాడు వేల ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించామని గుర్తు చేశారు. గత పది ఏళ్లలో పేదవాడికి కనీసం ఒక ఇల్లు నిర్మించని దద్దమ్మ ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు. నేడు మొదటి విడతలోనే నియోజకవర్గ వ్యాప్తంగా 3500 ఇల్లు మంజూరు చేయించామని, మండల వ్యాప్తంగా 675 ఇల్లు మంజూరు చేయించామని అన్నారు, ఇప్పటికే 90 శాతం ఇల్లు పూర్తి అయ్యాయని ఆయన పేర్కొన్నారు. గత పదిలలో ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయని చేతకాని ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వానిదని విమర్శించారు.తమ ప్రజా ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కేవలం బూర్గం పహాడ్ మండలంలోని 2500 నూతన రేషన్ కార్డులు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదని సుమారు 15 వేల మంది కి 6 కేజీల చొప్పున సన్న బియ్యం అందుతున్నాయని పేర్కొన్నారు.భూభారతి లో భాగంగా ఇప్పటికే పట్టా యజమాని చనిపోతే వారసత్వం కింద 400 మంది కి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించామని అన్నారు. కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు ఇప్పటివరకు 452 మంది కి పంపిణీ చేశామని అన్నారు. అనంతరం 52మంది లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అంతకుముందు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులు తలపురెడ్డి నాగేశ్వరి, నీరుడు రమణల ఇళ్లను ప్రారంభించారు. పూర్తిస్థాయిలో 5 లక్షల రూపాయలు బిల్లులు పడ్డాయని అడిగి తెలుసుకున్నారు. తమకు ఇల్లు మంజూరు చేసి నిర్మించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కె ఆర్ కె ప్రసాద్, ఎంపిడిఓ జమలారెడ్డి, స్థానిక పంచాయతీ సర్పంచ్ మంద నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి,పశువైద్య అధికారి ఠాగూర్, మండల విద్యాశాఖ అధికారి ఎదు సింహారాజు, మండల హౌసింగ్ శాఖ అధికారి ఉదయ్ కిరణ్,సిడిపిఓ రేవతి, సర్పంచ్ లు బాదం వెంకటేశ్వర రెడ్డి,బాబోయ్ పద్మ,గుండి బాబురావు,శర్ప నాగమణి ,మంగమ్మ, కిషోర్, సరోజ ,స్థానిక ఉప సర్పంచ్ గుండె వెంకన్న, డిప్యూటీ తహశీల్దార్ సమ్మయ్య, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్, పినపాక నియోజకవర్గం బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి,మాజీ పిఎసిఎస్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఇంగువ రమేష్, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు భజన ప్రసాద్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎడమ కంటి సుధాకర్ రెడ్డి,కాటం వెంకట్రామిరెడ్డి,పూలపల్లి సుధాకర్ రెడ్డి, చల్లా వెంకటనారాయణ, మండల యూత్ ప్రెసిడెంట్ నిమ్మల హరీష్ యాదవ్,పోతు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దునుకు రాము,కైపు శ్రీనివాసరెడ్డి, సారెడ్డి అశోక్ రెడ్డి,తిరుపతి చంటి, బెల్లం కొండ రామారావు, టిడిపి మండల అధ్యక్షులు తాళ్లూరి జగదీష్ రావు, రహీం ఖాన్, దుగ్గెంపూడి సుశాంత్ రెడ్డి,చెంచలపు శ్రీనివాస్ రావు,చిప్పా రాజు, చిర్ర నాని, ఆర్పీ, రాజు, దాసరి సాంబ,బోనం నాగిరెడ్డి ,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ప్రారంభం

**పూలే జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాయం**



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బూర్గంపాడు మండలంలో రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కాలేజ్‌లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థినుల కోసం మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు అత్యంత అవసరమని తెలిపారు. ఇలాంటి కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు బాలికల ఆరోగ్యం, హైజీన్‌తో పాటు వారి విద్యాభ్యాసాన్ని కొనసాగించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.అనంతరం కాలేజ్ యాజమాన్యం పలు సమస్యలపై ఎమ్మెల్యే కి వినతిపత్రం అందజేసింది. వాటిని సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఇదే సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని, పూలే గారి సమాజ సేవ, విద్యా విస్తరణలో చేసిన కృషిని స్మరించుకున్నారు. ఆయన చూపిన మార్గం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, వార్డెన్, ఎంపీడీవో, ఎంఆర్‌వో తదితర అధికారులు, మండల అధ్యక్షుడు దుగ్గంపూడి కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేణుక చౌదరి పర్యటన విజయవంతం చేయాలి

**జిల్లా కాంగ్రెస్ నాయకులు గురిజాల గోపి**



**మణుగూరు, మహా :** మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి ఈ నెల 13న భద్రాచలం, మణుగూరు పర్యటనకు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు గురిజాల గోపి కోరారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ తో కలిసి రేణుక చౌదరి పర్యటన ముఖ్యమైనదని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఐదు గ్రామ పంచాయితీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రజా సమస్యలపై తన స్వరాన్ని వినిపించేందుకు ఆమె పర్యటన చేపడుతున్నారని తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముద్దుబిడ్డగా గుర్తింపు పొందిన రేణుక చౌదరి రానున్న సందర్భంగా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొన్నదని గోపి అన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పర్యటనను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పూలే ఆశయాలు నేటి సమాజానికి దారి చూపాలి

**సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు**



**బూర్గంపహాడ్ మహా :** మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా బూర్గంపాడు మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బూర్గంపాడు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సమ సమాజ నిర్మాణం కోసం పూలే చేసిన పోరాటం నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. సమాజాన్ని మానవతా విలువల పునాదులపై నిర్మించేందుకు ఎన్నో మహనీయులు కృషి చేసినప్పటికీ, పూలే వంటి మహనుభావుల ఆలోచనలు పాఠశాల స్థాయిలో సరైన స్థానం పొందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే, సనాతన ధర్మం పేరుతో కొందరు బ్రాహ్మణ ధర్మాన్నే ప్రతిపాదిస్తున్నారని, కానీ భారతదేశంలో ప్రాచీన కాలం నుంచే సమానత్వం, హేతువాదం వంటి భావజాలాలను ప్రచారం చేసిన అజిత కేశ కంబళుడు, చార్వాకులు, లోకాయత్తులు, జైనులు, బుద్ధుడు వంటి మహనీయుల సిద్ధాంతాలే నిజమైన సమతాధర్మమని వివరించారు. పాశ్చాత్య దేశాల్లో ప్లాటోను హేతువాద పితామహుడిగా భావిస్తే, మన దేశంలో అతనికంటే ముందే హేతువాదాన్ని ప్రచారం చేసినవారు ఉన్నారని గుర్తు చేశారు.ఆధునిక యుగంలో కుల వ్యవస్థ అనే విషవృక్షాన్ని ఎదుర్కొంటూ, ఇంగ్లీషు విద్య ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువచ్చిన మహానుభావుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. బ్రిటిష్ పాలనలో వచ్చిన గులామగిరి కంటే, వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న సామాజిక అసమానతలే పెద్ద సమస్యగా పూలే గుర్తించారని, వాటి నిర్మూలన కోసం ఆయన జీవితాంతం పోరాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్కే అబిదా, దాసు, వీరన్న, రాములు, ఉపేందర్, వెంకటేశ్వర్లు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



## యాదవ బజార్‌లో ప్రధానం వేడుక

**ఎమ్మెల్యే పాయం హాజరు**

**బూర్గంపాడు మండలం:** బూర్గంపాడు మండలం యాదవ బజార్‌లో చీర్ల సత్యనారాయణ - భద్రమ్మ దంపతుల కుమార్తె ప్రధానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై, వధువుకు ఆశీస్సులు అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వధువుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,.కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారి ఆనందంలో భాగస్వామ్యమయ్యారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దుగ్గంపూడి కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేసవి దాహం తీర్చేందుకు సోంపల్లి గ్రామ పంచాయతీ వద్ద చలివేంద్రం ప్రారంభం




**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపాడు మండలం,సోంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మండుతున్న ఎండలు మరియు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని గ్రామ పాలక మండలి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ఘనంగా ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు కలిసి ప్రారంభించారు. వేసవికాలంలో గ్రామ ప్రజలు, ప్రయాణికులు, కార్మికులు తీవ్ర దాహంతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గుర్తించిన గ్రామపంచాయతీ, ముందస్తుగా చర్యలు తీసుకుని ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.ముఖ్యంగా మధ్యాహ్న వేళల్లో పని చేసే కూలీలు, ఆటో డ్రైవర్లు, రహదారులపై ప్రయాణించే వారు ఈ చలివేంద్రం ద్వారా చల్లని తాగునీరు పొందగలుగుతారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా తాగునీటి వంటి మౌలిక అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. వేసవిలో డీహైడ్రేషన్, హీట్ స్ట్రోక్ వంటి సమస్యలు ఎక్కువగా ఎదురయ్యే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలో అవసరమైన చోట్ల మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించినట్లు వెల్లడించారు.చలివేంద్రంలో శుద్ధి చేసిన తాగునీరు, గ్లాసులు, నీటి నిల్వ కోసం ట్యాంకులు వంటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. రోజూ శుభ్రత పాటిస్తూ, నీటి నాణ్యతను కాపాడేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించినట్లు గ్రామపంచాయతీ అధికారులు తెలిపారు. గ్రామంలోని యువత, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి చలివేంద్రం నిర్వహణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు కూడా ఈ సదుపాయాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకొని, శుభ్రతను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.ఈ చలివేంద్రం ద్వారా గ్రామంలో వేసవి తీవ్రత కొంతవరకు తగ్గి ప్రజలకు ఉపశమనం కలగనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సెక్యూరిటీ గార్డ్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి కార్పొరేట్ ఎస్ అండ్ పిసి విభాగంలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్ గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు ఇటీవల మరణించాడు. మృతి చెందిన వెంకటేశ్వర్లు కుటుంబానికి శనివారం ఎస్ అండ్ పిసి డిపార్ట్మెంట్ కార్పొరేట్ ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో రూ.41500 ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇన్స్పెక్టర్లుడి. నారాయణ రెడ్డి, కె.రాజనర్సు, జమేదారులు, ఏఐటియూసి, ఐఎన్టీయూసీ యూనియన్ల ఫిట్ సెక్రటరీలు, ఎస్ అండ్ పిసి సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. పాల్వంచ మండలం దంతెలబోర గ్రామానికి చెందిన నూనె వినయ్ కుమార్ (25) కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు.లభించిన వివరాల ప్రకారం, వినయ్ కుమార్ రాత్రి సమయంలో పురుగుల మందు సేవించి, బూర్గంపాడు మండలం రామాపురం క్రాస్ రోడ్ వద్ద కుప్పకూలి మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది.మృతుడి తల్లి నూనె వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై ఎస్ఐ నాగ బిక్షం విచారణ చేపట్టారు.స్థానికులు, బంధువులు యువకుడి మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



## గౌతాపురంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం

**పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బూర్గంపాడు మండలం పరిధిలో గౌతాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారు ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారుల ఆనందంలో భాగస్వామ్యమయ్యారు.ఈ సందర్భంగా తల్లాపురెడ్డి నాగేశ్వరి, నీరుడు రమణకు కేటాయించిన ఇళ్లలో గృహప్రవేశం నిర్వహించగా, ఎమ్మెల్యే స్వయంగా పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఇళ్లలో సుఖసంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంత ఇల్లు కలగడం గొప్ప విషయమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామ స్థాయిలో మరింత వేగంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎమ్మార్వో, హౌసింగ్ ఏఈతో పాటు మండల అధ్యక్షుడు దుగ్గంపూడి కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచులు, ఉపసర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వేపలగడ్డ ప్రీమియర్ లీగ్ సీజన్-3 ఘన ముగింపు



**విజేతలకు బహుమతుల ప్రదానం**

**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపహాడ్ మండలం వేపలగడ్డ వేదికగా కొమరంభీమ్ యువసేన ఆధ్వర్యంలో వారంరోజుల పాటు నిర్వహించిన వేపలగడ్డ ప్రీమియర్ లీగ్ సీజన్3 క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా విజేత జట్లకు ఆదివాసీ ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు బహుమతులు ప్రదానం చేశారు.టోర్నమెంట్‌లో మొదటి బహుమతిగా అంజనాపురానికి చెందిన ఆంజనేయ లెవెన్ జట్టు విజేతగా నిలిచి రూ.21,000 నగదు బహుమతిని స్థానిక సర్పంచ్ శ్రీమతి బొల్లి నిరోషా చేతుల మీదుగా అందుకుంది. రెండో బహుమతిగా వేపలగడ్డకు చెందిన రోకో లెవెన్ జట్టు రూ.11,000 నగదు బహుమతిని పాయం వెంకటేశ్వర్లు పుష్పావతి, అఖిల్ గార్ల ద్వారా అందుకుంది. మూడో బహుమతిగా మోరంపల్లి బంజర ప్రాంతానికి చెందిన మహీ లెవెన్ జట్టు రూ.6,000 నగదు బహుమతిని మెండి కిషోర్ ప్రదానం చేశారు. అలాగే గెలుపొందిన మూడు జట్లకు బట్టా మల్లయ్య చారిటబుల్ సొసైటీ సహకారంతో విజయ ట్రోఫీలను బూర్గంపహాడ్ మండల మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల పెద్దలు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఆదివాసీ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సమస్యల పరిష్కారానికి సింగరేణి సహకారం అవసరం

**కొత్తగూడెం మేయర్ మూడు గణేష్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి సింగరేణి సహాయ సహకారాలు అందించాలని కొత్తగూడెం మేయర్ మూడు గణేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయన సింగరేణి ప్రధాన కార్యాలయంలోని సింగరేణి జీఎం పర్సనల్ వెల్ఫేర్ జీవీ.కిరణ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా మేయర్ జీఎంని శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో సింగరేణి కార్మిక సంఘమైన ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రమణమూర్తి, వంగా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



## మహాత్మ జ్యోతిరావు పూలేకి ఘన నివాళి

**చర్ల మహా :** మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే విద్యావేత గొప్ప భారత సంఘసంస్కర్త బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మరియు కుల వెతిరేకత పోరాట యోధుడు పూలే 1827 ఏప్రిల్ 11 న మహారాష్ట్రలో జన్మించారు వారి జీవితంలో అంటరానితనం మరియు అనేక సార్లు కుల వివక్షతో అవమానించబడ్డారు దీనికి ముఖ్య కారణం చదువు లేకపోవడమే అని పాఠశాలలు ఏర్పాటు చేసారు వితంతువులకు గృహాలను ఏర్పాటు చేసారు ఆయన భార్య సావిత్రి పూలే తో విద్య నేర్పించారు ఆమె మొదటి మహిళా ఉపాధ్యాయురాలు వీరిద్దరి చేవలు మరవలేమని తెలియజేసారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు SD అజీజ్ తడికల బుల్లెబ్బాయి బిసి సెల్ అధ్యక్షుడు గోరింట్ల వెంకటేశ్వరావు యూత్ అధ్యక్షుడు అంబోజి సతీష్ ఆలం బ్రహ్మానాయుడు యన్నమూరి సృజన కుమార్ వార్డు మెంబర్ కట్టం కన్నారావు అంకాల శ్రీనివాసరావు అలవాల కృష్ణ కనుకు వీరభద్రం గాధంశెట్టి కిశోర్ కుక్కడపు సాయి పాల్గొన్నారు

## నియోజకవర్గంలో పాయం జోరు..

- కాంగ్రెస్ దిశగా భారీ వలసలు..
- మణుగూరులో 20 కుటుంబాల చేరిక
- ఎమ్మెల్యే పాయంకు బలమైన కాల్ గుమస్తాల మద్దతు..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేపడుతున్న అభివృద్ధి చర్యలతో ఆకర్షితులై వివిధ వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మణుగూరు క్యాంప్ కార్యాలయంలో మణుగూరు కాలరీస్ కోల్ ట్రాన్స్‌పోర్ట్ గుమస్తాల సంఘంకు చెందిన 20 మంది సభ్యులు తమ కుటుంబాలతో సహా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్వయంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఇది కేవలం 20 మంది చేరిక కాదు, 20 కుటుంబాల నమ్మకం. ప్రజల కష్టాలను అర్థం చేసుకుని పరిష్కరించే ప్రభుత్వానికి దక్కిన గుర్తింపు అన్నారు.

# నింగిలో భారత్ అజేయ శక్తి..

## 'మేడ్ ఇన్ ఇండియా'లో 114 రాఫెల్ యుద్ధ విమానాలు!

### డ్రోన్ల అనుసంధానంతో 'రాఫెల్ ఎఫ్5' సరికొత్త విప్లవం!

### స్వదేశీ విమానయాన రంగానికి భారీ ఊతం.



**ఢిల్లీ, మహా:** భారత వాయుసేన అమ్ములపొదలో అత్యంత శక్తివంతమైన అస్త్రాలుగా పేరుగాంచిన రాఫెల్ యుద్ధ విమానాల సంఖ్యను భారీగా పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. గతంలో కుదుర్చుకున్న 36 విమానాల ఒప్పందం కేవలం ఆరంభం మాత్రమేనని చాటిచెబుతూ, ఇప్పుడు ఏకంగా 114 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు రంగం సిద్ధం చేసింది. దీనికి సంబంధించిన రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ ను వచ్చే నెలలో జారీ చేసేందుకు రక్షణ కొనుగోళ్ల మండలి ఇప్పటికే ప్రాథమిక ఆమోదం తెలిపింది. ఇది కేవలం ఒక కొనుగోలు ఒప్పందం మాత్రమే కాదు, భారత రక్షణ రంగ ఆత్మనిర్భరతను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే ఒక వ్యూహాత్మక అడుగు. వచ్చే రెండు దశాబ్దాల పాటు అంటే 2040ల వరకు భారత గగనతల ఆధిపత్యం తిరుగులేకుండా ఉండేలా అత్యంత ఆధునికమైన ఎఫ్4 , ఎఫ్5 వేరియంట్లను భారత్ దక్కించుకోనుంది.సాంకేతిక పరిజ్ఞానం విషయానికి వస్తే, రాఫెల్ ఎఫ్4 వేరియంట్ యుద్ధ రంగంలో సరికొత్త అనుభూతిని అందించనుంది. ఇందులో అమర్చిన అత్యాధునిక సెన్సార్ ఫ్యూజన్ సాంకేతికత ద్వారా శత్రువుల కదలికలను ముందే గుర్తించడమే కాకుండా, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్ ద్వారా శత్రు రాడార్లను దారి తప్పించవచ్చు. మీటియర్ వంటి లాంగ్ రేంజ్ క్షిపణుల అనుసంధానం ఈ విమానానికి ఎదురులేకుండా చేస్తుంది. ఇక భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రూపొందిస్తున్న ఎఫ్5 వేరియంట్ ద్వారా మానవ సహిత , మానవ రహిత విమానాల అనుసంధానాన్ని భారత్ సొంతం చేసుకోనుంది. అంటే, ఒక పైలట్ నడిపే రాఫెల్ విమానం తనతో పాటు యుద్ధ భూమిలోకి డ్రోన్ల సమూహాన్ని కూడా నియంత్రిస్తూ దాడి చేయగలదు. ఈ తరహా సామర్థ్యం భారత వాయుసేనను ప్రపంచంలోని అత్యుత్తమ వైమానిక దళాల సరసన నిలబెడుతుంది.ఈ ఒప్పందంలోని అత్యంత కీలకమైన అంశం 'మేడ్ ఇన్ ఇండియా' నిబంధన. గతంలో జరిగిన 36 విమానాల ఒప్పందం నేరుగా ప్రభుత్వాల మధ్య జరిగిన కొనుగోలు కాగా, ఈ 114 విమానాల ఒప్పందంలో అత్యధిక శాతం విమానాలను భారత్‌లోనే తయారు చేయాల్సి ఉంటుంది. కేవలం విమానాల తయారీ మాత్రమే కాకుండా, వాటి అసెంబ్లీ, లోతైన సాంకేతిక బదలాయింపు వంటి అంశాలను కేంద్రం ఈ ఒప్పందంలో తప్పనిసరి చేసింది. దీనివల్ల ప్రభుత్వ రంగ సంస్థ అయిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తో పాటు ప్రైవేట్ రంగంలోని విమానయాన తయారీ సంస్థలకు కూడా భారీ ఎత్తున అవకాశాలు లభిస్తాయి. దేశవ్యాప్తంగా ఒక బలమైన ఏరోస్పేస్ తయారీ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యంగా ఈ డీల్ రూపొందుతోంది. దీనివల్ల వేలాది మందికి ఉపాధి లభించడమే కాకుండా, విదేశీ సాంకేతికతపై మన ఆధారపడటం తగ్గుతుంది.ఈ 114 విమానాల కోసం దేశంలోనే పూర్తిస్థాయి ఎంఆర్ఓ , మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. అంటే భవిష్యత్తులో ఈ విమానాల నిర్వహణ కోసం మనం ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో మారుతున్న భద్రతా సమీకరణాల నేపథ్యంలో, ఇంతటి భారీ సంఖ్యలో అత్యాధునిక యుద్ధ విమానాలు అందుబాటులోకి రావడం భారత రక్షణ వ్యవస్థకు ఒక కొండంత అండగా నిలుస్తుంది. ఇది కేవలం ఆయుధాల సేకరణ కాదు, వికసిత భారత్ లక్ష్యంలో భాగంగా రక్షణ రంగంలో సాధిస్తున్న స్వయం సమృద్ధికి ఒక నిదర్శనం. వచ్చే నెలలో జారీ కానున్న ప్రతిపాదనలతో భారత వైమానిక చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలు కాబోతోంది.




# అరాచకత్వాన్ని అంతమొందిద్దాం

### బెంగాల్లో మార్పు పవనాలు బలంగా ఉన్నాయి

### సిండికేట్ పాలనపై మోదీ ఆగ్రహం

**కలకత్తా, మహా:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దాలుగా పాతుకుపోయిన అరాచకత్వానికి, అవినీతికి చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మంగళవారం దక్షిణ్ దినాజ్‌పూర్ జిల్లాలోని బాలూర్‌ఘాట్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తూ, అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)పై నిప్పులు చెరిగారు. పశ్చిమ బెంగాల్ వంటి చారిత్రాత్మక గడ్డపై నేడు ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, అధికార పార్టీ అండతో సంఘ విద్రోహ శక్తులు సామాన్యులను పీడిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ్ దినాజ్‌పూర్ సాక్షిగా బెంగాల్ గడ్డపై వీలుస్తున్న మార్పు పవనాలు అత్యంత స్పష్టంగా ఉన్నాయని, ప్రజలు టీఎంసీ విఫల నమూనాను తిరస్కరించి, బీజేపీ అందిస్తున్న అభివృద్ధి దార్శనికత వైపు మొగ్గు చూపుతున్నారని ప్రధాని ఉద్ఘాటించారు. బెంగాల్‌లో ఇప్పుడు ఒక అదృశ్య 'సిండికేట్' పాలన సాగుతోందని, ప్రతి చిన్న పనికి కూడా ప్రజలు ఈ సిండికేట్లకు కప్పం కట్టాల్సిన దుస్థితి నెలకొందని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పేదల కోసం ఇళ్లు, తాగునీరు వంటి సంక్షేమ పథకాలను మంజూరు చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం తన రాజకీయ స్వార్థం కోసం వాటిని అడ్డుకుంటోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మృగ్యమై, యువత ఇతర రాష్ట్రాలకు వలస పోతుంటే, టీఎంసీ నాయకులు మాత్రం ఉద్యోగాల అమ్మకంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. ఈ అవినీతి సామ్రాజ్యాన్ని కూల్చివేసి, బెంగాల్‌ను మళ్లీ పారిశ్రామికంగా, విద్యాపరంగా అగ్రస్థానంలో నిలబెట్టడమే తమ లక్ష్యమని మోదీ స్పష్టం చేశారు.సందేశ్‌ఖాలీ ఉదంతాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని చేసిన వ్యాఖ్యలు అత్యంత హృదయవిదారకంగా సాగాయి. మహిళల ఆత్మగౌరవంతో ఆడుకుంటున్న నేరస్థులను ప్రభుత్వం వెనకేసుకురావడం బెంగాల్ చరిత్రలో ఒక చీకటి అధ్యాయమని ఆయన పేర్కొన్నారు. సందేశ్‌ఖాలీ ఆడబిడ్డల కన్నీరు ఊరికే పోదని, వారి ఆవేదన టీఎంసీ పతనానికి నాంది పలుకుతుందని హెచ్చరించారు. మానవీయ కోణంలో చూస్తే, రక్షణ కల్పించాల్సిన పోలీసు యంత్రాంగమే అధికార పార్టీకి తొత్తుగా మారి బాధితుల గొంతు నొక్కడం సభ్య సమాజం తలవంచుకోవాల్సిన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా శక్తిని తృణీకరించే ఏ ప్రభుత్వం కూడా మనగలిగిన దాఖలాలు లేవని, వచ్చే ఎన్నికల్లో మహిళల ఓట్లే టీఎంసీకి అసలైన తీర్పుగా మారుతాయని ప్రధాని మోదీ జోస్యం చెప్పారు.సరిహద్దు జిల్లా అయిన దక్షిణ్ దినాజ్‌పూర్ భద్రతపై కూడా ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులను ప్రోత్సహిస్తూ, స్థానిక దళితులు మరియు గిరిజనుల హక్కులను కాలరాస్తున్నారని మమతా బెనర్జీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిహద్దుల్లో జరుగుతున్న జనాభా మార్పిడి కుట్ర దేశ భద్రతకు పెను ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఏఏ వంటి చట్టాలను వ్యతిరేకించడం ద్వారా టీఎంసీ శరణార్థులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. రామ మందిర ఉత్సవాలను సైతం అపవిత్రంగా చిత్రీకరించే శక్తులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. 'మోదీ గ్యారెంటీ' అంటే ప్రతి పౌరుడికి భద్రత, అభివృద్ధి మరియు ఆత్మగౌరవం అని, వికసిత భారత్ నిర్మాణంలో బెంగాల్‌ను అగ్రగామిగా చేయడమే తన స్వప్నమని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. సభకు తరలివచ్చిన అశేష జనవాహినిని చూస్తుంటే బెంగాల్‌లో బీజేపీ విజయం ఖాయమని అర్థమవుతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.





## అమ్మగారిపల్లి సమస్యలపై ఎమ్మెల్యే పాయంకు వినతి..

- వినతి పత్రం అందజేసిన సర్పంచ్ ఇర్ప కవిత..
- సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ..



**మణుగూరు /అశ్వాపురం, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా షాపురం మండల పరిధిలోని మండలంలోని అమ్మగారిపల్లి గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సర్పంచ్ ఇర్ప కవిత ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిశారు.శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసిన సర్పంచ్ ఇర్ప కవిత గ్రామంలోని మౌలిక వసతులు, రహదారుల దుస్థితి, తాగునీటి సమస్యలు తదితర అభివృద్ధి అంశాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పందిస్తూ, గ్రామంలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అమ్మగారిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఇర్ప కవితతో పాటు గ్రామానికి చెందిన పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ దీక్షకు బూసిరెడ్డి శంకర్ రెడ్డి మద్దతు



**బూర్గంపహాడ్ మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక గ్రామంలో ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు 16వ రోజుకు చేరుకున్నాయి. కార్మికుల సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ ఈ దీక్షలు కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా అంతర్జాతీయ గాంధీ పథం అధ్యక్షులు మరియు భద్రాద్రి పరిరక్షణ ప్రాంతా అధ్యక్షులు బూసిరెడ్డి శంకర్ రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. దీక్షలో పాల్గొని కార్మికుల పోరాటానికి తన పూర్తి మద్దతు ప్రకటించారు.కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని ఆయన పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం, ఉద్యోగ భద్రత కల్పించడం, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవడం వంటి డిమాండ్లు న్యాయసమ్మతమైనవని అన్నారు.కార్మికుల హక్కుల కోసం జరుగుతున్న ఈ ఉద్యమం న్యాయమైనదని, ప్రభుత్వం మరియు యాజమాన్యం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో , జేఏసీ కన్వీనర్ పార్టీ సోమిరెడ్డి , కార్మిక సంఘ nj ప్రతినిధులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలిపై దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్ – మరొకరు పరారీలో

**బూర్గంపహాడ్ మహా :**బూర్గంపహాడ్ మండలంలో వృద్ధురాలిని మోసం చేసి దోపిడీ చేసిన కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం, 14022026 సాయంత్రం ఇద్దరు వ్యక్తులు బూర్గంపాడు ప్రాంతానికి బైక్‌పై వచ్చి, కుక్కునూరు మండలం వేలేరు గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలిని ఉచితంగా బియ్యం, గోధుమపిండి ఇస్తామని నమ్మించి బండిపై ఎక్కించుకున్నారు. అనంతరం జింకలగూడెం దాటి ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, ఆమెను బెదిరించి మెడలో ఉన్న బంగారు, వెండి పట్టీలు, రూ.3,000 నగదు, సెల్‌ఫోన్ దోచుకుని పరారయ్యారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన బూర్గంపాడు పోలీసులు, పాల్వంచ సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ ఆధ్వర్యంలో నిందితుడిని గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏ కొండూరు మండలం తండాకు చెందిన బానావత్ మురళి నాయక్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి వద్ద నుండి దొంగిలించిన బంగారు బిళ్ళలు, చెవి దిద్దులు, వెండి పట్టీలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మురళి నాయక్‌ను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో నిందితుడు కొప్పుల వెంకటేశ్వర్లు పరారీలో ఉండగా, అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

## జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయం

**సింగరేణి డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**మహాత్మ జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయమని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్)ఎల్.వి.సూర్యనారాయణ, డైరక్టర్(పి అండ్ పి)కే.వెంకటేశ్వర్లు అన్నారు. సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలను సింగరేణి ప్రధాన కార్యాలయ హెచ్ఆర్‌డి కాన్ఫరెన్స్ హాల్ నందు శనివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. జనరల్ మేనేజర్( పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జివి.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు ఈ కార్యక్రమానికి ప్రత్యేక బడ్జెట్ను కేటాయించడం జరిగిందన్నారు. సామాజిక సంస్కర్త విద్యావేత్త అయిన మహాత్మా జ్యోతిరావు పూలే అణగారిన వర్గాల కోసం కుల వివక్ష లింగ అసమానతలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారని ముఖ్యంగా మహిళల విద్య కోసం అవిశ్రాంతంగా శ్రమించారని అణిచివేత చర్యలకు వ్యతిరేకంగా దళితుల తరపున పోరాడారని వివరించారు. అందరం సమానత్వం పాటిస్తూ కలసి కట్టుగా ఉంటూ మహాత్మా జ్యోతిరావు పూలే నిర్దేశించిన మార్గాన్ని అందరూ తూచ తప్పకుండా పాటించటమే మనం వారికి ఇచ్చే ఘనమైన నివాళి అని ఆ మహానుభావుడు ఆ రోజుల్లో ఉన్న అసమానతలను రూపు మార్చటానికి చేసిన కృషిని ఆదర్శంగా తీసుకొని ఆచరిస్తూ ప్రస్తుతం సమాజంలో ఉన్న అసమానతలను రూపుమార్చటానికి కృషిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం(ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్.వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్‌టియూసి) కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పీతాంబరరావు, సిఎంఓఏఐ కార్పొరేట్ ప్రెసిడెంట్ ఎస్.వెంకటాచారి, సింగరేణి బిసి చీఫ్ లైజన్ ఆఫీసర్ పి.హరి శంకర్, కార్పొరేట్ బిసి అండ్ ఓబిసి లైజన్ ఆఫీసర్ మురళి, కార్పొరేట్ ఎస్‌సి లైసన్ ఆఫీసర్ డాక్టర్ కే.మాలతి, కార్పొరేట్ ఎస్‌టి లైసన్ ఆఫీసర్ కే.హాతిరామ్, కార్పొరేట్ బిసి ఓబిసి వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, ఎస్సి ఎస్టి ఉద్యోగస్తుల సంక్షేమ సంఘ జనరల్ సెక్రెటరీ అంతోటి నాగేశ్వరరావు, ఎస్‌టి సంక్షేమ సంఘం నాయకులు బి.నాగేశ్వరరావు, బిసి అసోసియేషన్సెంట్రల్ ఆర్గనైజ్ సెక్రెటరీ టి.నరేంద్రబాబు, బిసి అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ ఆర్.వెంకటేశ్వర ప్రకాష్, డిజిఎం(పర్సనల్)లు కేసా నారాయణ రావు, బి.శివకేశవ రావు, ముకుంద సత్య నారాయణ, కార్పొరేట్ ఏరియా జిఎంలు, అధికారులు, బిసి ఓబిసి నాయకులు కార్యకర్తలు, ఉద్యోగులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**భద్రాచలం మహా :**స్థానిక భద్రాచల పట్టణంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి ఉత్సవాలను మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ నాయకులతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ ముస్లిం మైనారిటీ సంఘాల ప్రతినిధులు మరియు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం నాయకులు మాట్లాడుతూ.. భారతదేశంలో సామాజిక విప్లవానికి పూలే ఆద్యుడని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, ముఖ్యంగా మహిళా విద్య కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కుల వివక్ష లేని సమాజం కోసం పూలే కన్న కలలను నిజం చేయడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. దేశంలోని అణగారిన వర్గాలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు లభించడంలో పూలే ఆలోచనలే పునాదులని, నేటి యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ వేడుకల్లో మాదిగ జేఏసీ ముఖ్య నాయకులు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు మరియు ప్రజా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

**అంబేద్కర్ విగ్రహ సాధన సమన్వయ కమిటీ ఎన్నిక.**

భద్రాచలం పట్టణంలో నూతన అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయుట విషయమై రౌండ్ టేబుల్ సమావేశంలో అన్ని రాజకీయ పార్టీలు నాయకులు మరియు బిసి ఎస్సీ ఎస్టీ నాయకులు పాల్గొన్నారు. నూతన అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయుటకు బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ నాయకులతో 27 మంది సభ్యులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.

# చారిత్రాత్మక ఉధ్యమం



**చర్ల మహా :**చర్ల మండల పెద్ద మిడిసిలేరు గ్రామ పంచాయతీ సర్పంచి బెండబోయిన సుహాసిని ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ వార్డు మెంబర్ గ్రామ ప్రజలు అందరు ఐక్యమత్యంగా ఒకే తాటిపై నిలబడి మధ్య నిషేధ గ్రామంగా తయారు చేయాలని గత వారం రోజుల నుంచి ఉధ్యమాన్ని చేస్తున్నారు ఆ సందర్భంగా ఈరోజు పెద్ద మిడిసిలేరు గ్రామంలో గ్రామ పెద్దలు సర్పంచులు అధికారుల గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో మద్యపానము నిషేధించాని తీర్మానం చేసారు ఈ సందర్భంగా సర్పంచ్ సుహాసిని మాట్లాడుతూ మా గిరిజన గ్రామాల్లో గుడుంబ మరియు మధ్యం ఇతర మత్తు పదార్థాలు అమ్ముట వలన యువకులు మత్తు మందులను బానిసై జీవితాలను ఆరోగ్యాలను పాడుచేసుకుంటూనారు ఆడవాళ్ల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి ఎన్నో సంవత్సరాలుగా బాధలు పడుతున్నారు మా గిరిజనుల అమాయకత్వాని వాడుకొని డబ్బులు సంపాదిస్తున్నారు వారి జీవితాలను నాశనం చేస్తున్నారు మా పంచాయతీలో ఎక్కడేన మందు అమ్మితే మీ షాపులు ఉండవు మన గిరిజన పిల్లలను మనమే పాడు చేసుకుంటూనాము ఇకనైనా మేలుకోండి మన జీవితాలు మనమే బాగు చేసుకోవాలి అని తెలియజేసారు ఈ సంవత్సరం మహిళ సర్పంచులను ఎన్నుకోవడం వలన ఆడవాళ్ల పడే బాధ వారికి తెలియడం వలన పంచాయతీలలో మధ్యం పై ఉధ్యమాలు చేపడుతున్నారు ఈ రోజు సమావేశానికి శ్యామల రామారావు తిప్పాపురం సర్పంచి సునీత అధికారులు పాల్గొన్నారు పెద్ద ముసిలేరు సర్పంచి సుహాసిని నిర్ణయాని ప్రజలందరు అభినందనలు తెలియజేస్తున్నారు

## సామాజిక సమానత్వానికి మార్గదర్శి మహాత్మ జ్యోతిరావు పూలే

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సామాజిక సమానత్వం విద్యా వ్యాప్తి కోసం జీవితాంతం కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే దేశానికి మార్గదర్శకుడిగా నిలిచారని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అంకిత్ మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో సమానత్వం న్యాయం నెలకొల్పడంలో జ్యోతిరావు పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.మహిళా విద్యకు ప్రాధాన్యతనిస్తూ ముందుగా తన భార్యకు విద్య అందించి మహిళల సాధికారతకు పునాది వేసిన మహనీయుడు పూలే అని ఆయన పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసి వారికి సామాజిక న్యాయం అందించేందుకు కొత్త దారులు చూపిన గొప్ప సంస్కర్తగా ఆయన నిలిచారని తెలిపారు.జాతి వర్ణ వివక్షలను వ్యతిరేకిస్తూ సమాన హక్కుల సమాజాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో పనిచేసిన పూలే ఆలోచనలు ఈనాటికీ ఎంతో ప్రాసంగికమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, బీసీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి దినేష్ ఎడి మైన్స్, ఉపేందర్ ఇ.డి ఎస్.సి. కార్పొరేషన్, జి.శ్రీనివాస్ జిల్లా ఆడిట్ అధికారి సుదీర్ కుమార్, పంచాయితీరాజ్ శాఖ, జిల్లా అధికారులు, బిసి సంఘ నాయకులు గుమలాపురం సత్యనారణ, జి.కృష్ణ, ఇంద్రాల మురళి, వారాధి సత్యనారాయణ, బండి రాజుగౌడ్, కార్యాలయ సిబ్బంది తదితరులు కార్యాక్రమంలో పాల్గొన్నారు.

## ఆర్టిజన్ కార్మికులను వెంటనే విడుదల చేయాలి

- అన్యాయంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికం
- అక్రమ అరెస్టులను ఖండించిన భద్రాద్రి కొత్తగూడెం సీఐటీయూ జిల్లా కమిటీ




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** రాష్ట్రవ్యాప్తంగా ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శనివారం చలో కేటీపీఎస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కదిలిన ఆర్టిజన్ కార్మికులను అక్రమంగా అన్యాయంగా అరెస్టు చేయడం ప్రజాస్వామికమని అరెస్టు చేసిన కార్మికులందరినీ వెంటనే విడుదల చేయాలని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ అధ్యక్షులు కే బ్రహ్మచారి డిమాండ్ చేశారు. కొత్తగూడెం పాల్వంచ లక్ష్మీదేవిపల్లి చుంచుపల్లి తదితర మండలాలలో అన్యాయంగా అరెస్టు చేసిన కార్మికులను పోలీస్ స్టేషన్ లో నిర్బంధించడం సరైనది కాదని వారన్నారు. అరెస్టు చేసిన వారిని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్, జిల్లా నాయకులు నందిపాటి రమేష్, లింగయ్య , జలాల్ ఆర్టిజన్ కార్మికులను పరామర్శించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలో 20000 మంది ఆర్టిజన్ కార్మికులు పని చేస్తున్నారని వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. గత ప్రభుత్వం పర్మినెంట్ చేయకుండా నిర్లక్ష్యం చేసింది అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికులందరి పర్మినెంట్ చేస్తా అని చెప్పి రెండున్నర సంవత్సరాలుగా వస్తున్న ఇంతవరకు పర్మినెంట్ చేయలేదు. ఆర్టిజన్ కార్మికులందరూ వాళ్ళ విద్యార్హతను బట్టి డిప్లమా చేసిన వాళ్లకి సబ్ ఇంజనీరు, డిగ్రీ చేసిన వాళ్ళకి జూనియర్ అసిస్టెంట్ ఐటిఐ చేసిన వాళ్ళకి జూనియర్ లైన్మెన్‌గా కన్వర్షన్ చేయాలని కోరారు. ఆర్టిజన్ కార్మికులు చనిపోతే వారి కుటుంబంలో పర్మిట్ ఉద్యోగం ఇవ్వాలని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ సమ్మె ఉగ్రరూపం దాల్చకముందే రాష్ట్రం మొత్తం చీకటిమయం కాకముందే సమస్య పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

## పదేళ్ల తరువాత సిజేరియన్ డెలివరీ

**హస్పిటల్ లో సౌకర్యాలు కల్పన అదనపు కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఏర్పాట్లు**



**నేలకొండపల్లి, మహా:**పదేళ్ల తరువాత స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో సిజేరియన్ డెలివరీ చేశారు. గత కొంత కాలంగా హస్పిటల్ లో కనీస సౌకర్యాలు లేకపోవటంతో సిజేరియన్ డెలివరీ లు చేపట్టలేదు. ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్.పి.శ్రీజ ప్రత్యేక చొరవ తీసుకుని కలెక్టర్ ఆదేశాలు మేరకు ఆపరేషన్ గది లో అధునిక వసతులకు నిధులు మంజూరు చేయించారు. అంతే కాకుండా పలుమార్లు పర్యటించి ప్రత్యేక శ్రద్ధ తో పనులు చేయించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉద్దేశ్యంతో సౌకర్యాలు కల్పించారు. శనివారం డాక్టర్ మంగళ, డాక్టర్ కె.రాజేష్‌లు సిజేరియన్ డెలివరీ చేశారు. దానావాయిగూడెం కు చెందిన చందన కు ఒలిగోహైడ్రామ్నియోస్ బిడ్డ మెడకు నాడి చుట్టుకుని ప్రసవం ఇబ్బంది కలగింది. దీంతో సిజేరియన్ డెలివరీ చేశారు. స్పైనల్ అనస్తీషియా కింద ఎలక్టివ్ ఎల్ఎస్‌సీఎస్ తో పాటు బీటీ చేశారు. తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యాధికారిణి డాక్టర్.మంగళ తెలిపారు. సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ కవిత, ప్రశాంతి లు సిజేరియన్ కు సహకరించారు. పదేళ్ల తరువాత సీహెచ్సీ లో సిజేరియన్ డెలివరీ చేశారు. ఇక నుంచి ఈ సిజేరియన్ డెలివరీలు చేసేందుకు సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు.

## చీమలపాడులో హైమాస్ట్ లైట్లు మంజూరు

**ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెల్పిన సర్పంచ్ లలిత**



**కారేపల్లి, మహా :** సింగరేణి మండల పరిధిలోని చీమలపాడు గ్రామపంచాయతీకి వైరా ఎమ్మెల్యే హైమాస్ట్ లైటు మంజూరు చేసినట్లు సర్పంచ్ మాలోతు లలిత బావుసింగ్ తెలిపారు. శనివారం లైట్ ఏర్పాటుకు సంబంధించి పనులు చేపట్టారు. ఈసందర్భంగా సర్పంచ్ లలిత బావుసింగ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ లో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మార్గదర్శకంలో అభివృద్ధి పనులు చేపట్టటం జరుగుతుందన్నారు. అభివృద్దిని నిధుల వెసులుబాటు అనుసరించి ప్రాధాన్యత క్రమంలో చేయటం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ గుజ్జర్లపూడి స్వాతి, వార్డ్ సభ్యుడు హరి, పార్టీ నరసయ్య,బావుసింగ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## వ్యసన బాధితులకు సమగ్ర చికిత్స

**అందుబాటులో పునరావాస సేవలు.. జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అడిక్షన్ కౌన్సిలింగ్ సెంటర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం సమాజంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వ్యసన బాధితులకు సమగ్ర చికిత్స పునరావాస సేవలు అందించేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.అనంతరం అదే ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రాన్ని కూడా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా మత్తు వ్యసనానికి గురైన వారికి ప్రత్యేక వైద్య చికిత్సలు నిపుణుల పర్యవేక్షణలో పునరావాస సేవలు నిరంతర కౌన్సిలింగ్ అందించబడతాయని వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మద్యానికి బానిసై చికిత్స కోసం వచ్చిన రోగితో మాట్లాడి రోజువారీ ఆదాయం మద్యంపై ఖర్చు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ వ్యక్తి తాను మద్యం మానేందుకు పలు మార్లు ప్రయత్నించినప్పటికీ వణుకుడు ఫిట్స్ వంటి సమస్యలు రావడంతో చికిత్స కోసం ఈ కేంద్రానికి వచ్చానని తెలిపాడు. ఈ తరహా కేసులకు అందిస్తున్న వైద్య సేవలు కౌన్సిలింగ్ విధానాలు చికిత్స ప్రక్రియ గురించి కలెక్టర్ అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులు పూర్తిగా కోలుకునేలా సమగ్ర చికిత్సతో పాటు నిరంతర కౌన్సిలింగ్ అందించాలని వైద్యులకు సూచించారు. ఇదే సందర్భంగా "డ్రగ్స్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెంగ్తెనింగ్ డే" కార్యక్రమం కింద నిర్వహించిన క్విజ్ వ్యాసరచన వక్తృత్వం చిత్రలేఖనం పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి కలెక్టర్ ప్రశంస పత్రాలు శీల్డులను అందజేశారు. యువతలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.మత్తు వ్యసన నిర్మూలనలో ప్రభుత్వ శాఖలు వైద్య విభాగం స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు బాధితులను ప్రోత్సహించి ఈ కేంద్రం సేవలను వినియోగించుకునేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, ఆసుపత్రి సూపర్డెంట్ రమేష్, డాక్టర్ రాధిక, డాక్టర్ రాదా మోహన్, ఇతర వైద్యులు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం గర్వకారణం

- జిల్లా కలెక్టర్ అంకిత్
- సమన్వయంతోనే జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డులు వైద్య శాఖకు కలెక్టర్ అభినందనలు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం గర్వకారణం అని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాల్లో ఒక భాగంగా జిల్లా వైద్య విధానం పరిషత్ ఆసుపత్రుల సిబ్బందికి ప్రశంస పత్రాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శనివారం పాల్వంచ పెద్దమ్మ గుడి సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై వైద్య సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేసి వారి సేవలను ప్రశంసించారు. గిరిజన ప్రాంతంగా ఉన్న జిల్లాలో నాణ్యమైన వైద్య సేవలను అందించడం ఎంతో సవాలుతో కూడుకున్నదైనా జిల్లా వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని తెలిపారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న ఈ జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడం ద్వారా ప్రజల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడంలో వైద్య శాఖ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. గతంలో మారుమూల గ్రామాలకు సరైన రహదారి కమ్యూనికేషన్ సదుపాయాలు లేకపోవడం వల్ల వైద్య సేవలను సమర్థవంతంగా అందించడంలో అనేక సమస్యలు ఎదురయ్యాయని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి రావడంతో చర్ల గుండాల వంటి దూర ప్రాంతాల్లో కూడా అత్యాధునిక వైద్య సేవలను అందించడం సాధ్యమైందని తెలిపారు. టెలీమెడిసిన్ డిజిటల్ కనెక్టివిటీ మొబైల్ వైద్య సేవల ద్వారా ప్రజలకు సమయానికి చికిత్స అందించడం సాధ్యమవుతోందని చెప్పారు.ఈ విజయానికి ఆశా కార్యకర్తల నుండి ఏఎన్ఎంలు స్టాఫ్ నర్సులు వైద్యులు జిల్లా స్థాయి అధికారులు వరకు అందరి సమన్వయం ముఖ్య కారణమని కలెక్టర్ అన్నారు. ప్రతి ఒక్కరు తమ తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడం వల్లనే జిల్లాకు రాష్ట్ర స్థాయిలో అత్యున్నత అవార్డులు లభించాయని తెలిపారు. ఇది జిల్లాకు గర్వకారణమని అన్నారు. జిల్లా వైద్య శాఖ ఇదే ఉత్సాహంతో ముందుకు సాగి రాబోయే రోజుల్లో రాష్ట్ర స్థాయితో పాటు దేశ స్థాయిలో కూడా అగ్రస్థానంలో నిలిచేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రతి పల్లె ప్రతి గిరిజన ప్రాంతానికి ఆరోగ్య సేవలు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రస్తుత సంవత్సరంలో సాధించిన విజయాలను కొనసాగిస్తూ వచ్చే సంవత్సరం కూడా మరిన్ని ప్రతిష్టాత్మక అవార్డులు జిల్లాకు తీసుకురావాలని వైద్య సిబ్బందిని ప్రోత్సహించారు. సేవా భావంతో పనిచేసే వైద్య సిబ్బంది వల్లే ప్రజల నమ్మకం పెరుగుతుందని ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అత్యంత ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ రవిబాబు, తాసిల్దార్ దారా ప్రసాద్, ఆసుపత్రుల సూపర్డెంట్లు, వైద్యులు, నర్సులు, సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో కొత్త టెండర్ విధానం రద్దు చేయాలి

**టీయూసీఐ డిమాండ్..**



**మణుగూరు, మహా :** సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకంలో అమలు చేస్తున్న నూతన టెండర్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, పాత టెండర్ విధానాన్నే కొనసాగించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్షులు ఆర్ మధుసూదన్ రెడ్డి సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. శనివారం ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ టీయూసీఐ అనుబంధం సంఘం మణుగూరు ఏరియా బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఓ టు జీఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, సింగరేణి వ్యాప్తంగా సుమారు 1200 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహిస్తూ సంస్థ ఆస్తుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వీరంతా భూ నిర్వాసితులు, ఓసి ప్రభావిత గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువకులు, పదవీ విరమణ పొందిన సింగరేణి కార్మికుల వారసులేనని తెలిపారు. అవుట్సోర్సింగ్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు తక్కువ జీతాలతో, చట్టబద్ధమైన హక్కులు, సౌకర్యాలు అందకపోయినా సంస్థ అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యాజమాన్యం తీసుకొచ్చిన కొత్త టెండర్ విధానం గార్డులకు నష్టకరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు నూతన టెండర్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానాన్నే కొనసాగించేలా సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై గార్డులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి సంజీవరెడ్డి, సతీష్, సుధాకర్, జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

## శతాబ్ది వేడుకల సందర్భంగా...

# గడపగడపకు సీపీఐ..

**మణుగూరులో విస్తృత ప్రచారం..**



**మణుగూరు, మహా :**సీపీఐ పార్టీ స్థాపనకు వందేళ్లు పూర్తైన సందర్భంగా మణుగూరు పట్టణంలో గడపగడపకు సీపీఐ కార్యక్రమాన్ని శనివారం విస్తృతంగా నిర్వహించారు. పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకుని పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను వివరించారు.

**పేదల కోసం నిరంతర పోరాటం – పుల్లారెడ్డి**

కార్యక్రమం సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా గడపగడపకు సీపీఐ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. పేద ప్రజలు, కార్మికులు, కర్షకులు, రైతాంగం సహా అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న పార్టీ సీపీఐ అని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని, పార్టీ బలోపేతానికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, మండల గౌరవ అధ్యక్షుడు తోట రమేష్, బోసెట్టి సంపత్, ఆధార్ రాములు, రంగు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### విప్లవకారుడు జ్యోతిరావు పూలే
# సేవలు చిరస్మరణీయం

**శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో ఘనంగా పూలే జయంతి వేడుకలు..**

**మణుగూరు, మహా :** సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయమని సామాజిక కార్యకర్త ఆంగోత్ మంగీలాల్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సంతోష్ నగర్‌లోని శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో నిర్వహించిన జ్యోతిబాపూలే జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంగీలాల్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే దంపతులు అట్టడుగు వర్గాల విద్యాభివృద్ధికి పునాదులు వేశారని అన్నారు. సమాజంలో ఆడపిల్లల విద్యను నిరాకరించిన కాలంలోనే పూణేలో దేశంలోనే తొలి బాలికల పాఠశాలను తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి ప్రారంభించారని గుర్తుచేశారు. కుల వివక్షత నిర్మూలనకు సత్యశోధక సమాజాన్ని స్థాపించి, బాల్యవివాహాలు, సతీసహగమనం, బానిసత్వం వంటి సామాజిక దురాచారాల నిర్మూలన కోసం ప్రజలను చైతన్యపరిచి పోరాడారని పేర్కొన్నారు. అనాధల కోసం శరణాలయాలను ఏర్పాటు చేసి, రైతు బంధువుగా సేవలందించిన మహానుభావుడిగా ఆయన నిలిచారని అన్నారు.



మహాత్మా జ్యోతిరావు పూలే కలలుగన్న సమానత్వ సమాజం సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అదే వారికి నిజమైన నివాళి అవుతుందని తెలిపారు. అనంతరం చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు బి. జగన్మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు సుహాసిని దేవి, సుజాత, కుమారి, గోపి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మణుగూరు మండల నాయకులు సత్ర పల్లి సాంబశివరావు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మణుగూరు ఏరియా సింగరేణి కాలనీ కంపెనీ ఆధ్వర్యంలో సింగరేణి పాఠశాలలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

### ఫీజు రీయింబర్స్మెంట్ పథకం
# ఎత్తివేతకు ప్రభుత్వ కుట్ర...

**శంషాబాద్ ఏబీవీపీ కన్వీనర్ ప్రదీప్**

**రాజేంద్రనగర్, మహా :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ దార పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో శంషాబాద్ లో శనివారం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో శంషాబాద్ విభాగ్ కన్వీనర్ ప్రదీప్ మాట్లాడుతూ పేద,బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నతవిద్యను ఉచితంగా అందించాలనే సదుద్దేశంతో తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు తీవ్రంగా మండిపడ్డారు.ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల పై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రఉంచినప్పుడు,ప్రభుత్వం ఈ అంశంపై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు పదే పదే కోరినప్పటికీ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయని కారణంగానే విద్యార్థుల దగ్గరనుండే ఫీజులు వసూలు చేసుకోవచ్చని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానేఈ చర్యకు ఒడిగట్టింది. ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని బొంద పెట్టడంలో భాగమే అని అన్నారు.ఈ స్కీమ్ ద్వారా లక్షల మంది పేద వర్గాల పిల్లలు ఇంజనీరింగ్,మెడిసిన్,ఫార్మసీ, లాంటి కోర్సులు పూర్తిచేసి దేశ విదేశాల్లో స్థిరపడి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసాను ఇస్తున్నారు.ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ పథకంపై ఆధారపడి యేటా 14 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ,కోర్సుల్లో ప్రవేశం పొందేటప్పుడే ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తుందన్న హామీ మేరకే విద్యార్థులు ప్రవేశం పొందాక ఫీజు చెల్లించకుండా, 10000 కోట్ల రూపాయల రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల



చేయకుండా ప్రభుత్వం విద్యార్థులను నయవంచనకు గురిచేస్తుంది.విద్య పై ప్రభుత్వం పెట్టే పెట్టుబడి రాష్ట్ర, దేశ అభివృద్ధికి ఉపయోగపడే మానవవనరుల సృష్టి కోసమేనని, ఇది ఏ మాత్రం ఉచిత పథకం కాదని,ఈ విషయాన్ని ప్రభుత్వం,సమాజం అర్థం చేసుకోవాలన్నారు.ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పేద విద్యార్థులకు విద్యాప్రదాయినిగా ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నది.ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకొచ్చింది,మేము అధికారంలోకి వస్తే బకాయిలు చెల్లించడమే కాకుండా, గొప్పగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.తీర అధికారం లోకి వచ్చాక స్వయంగా తానే విద్యా శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ఎత్తివేతకు కుట్రలు చేస్తున్నారు.నా దగ్గర పంచడానికి భూములు లేవు,కానీ జీవితాన్ని నిలబెట్టే విద్యను మాత్రం అందిస్తానని పదే పదే రేవంత్ రెడ్డి ఎందుకు పేద విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి.ప్రభుత్వం మెడలు వంచైనా సరే ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని కాపాడుకుంటామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో శంషాబాద్ నగర జాయింట్ సెక్రటరీ శ్యామ్, భరత్ శ్రీశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### సమాజ స్థాపనకు అహర్నిశలు కృషిచేసిన
# మహాత్మ జ్యోతిబాపూలే సేవలు మరువలేము

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల**

**రాజేంద్రనగర్, మహా ;** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ లో ఎస్సీ ఎస్టీ బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికై అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయులు ప్రముఖ సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే 199 జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి మహనీయుని విగ్రహానికి శనివారంపూలమాలవేసి నివాళులు ఘనంగా అర్పించారు. ఈ సందర్భంగా అందరికీ మహాత్మా జ్యోతి బా పూలే జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘసంస్కర్తగా, సామాజికవేత్తగా, సమ సమాజ స్థాపనకు అహర్నిశలు కృషి చేసి కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి, రచయిత మహాత్మా శ్రీ జ్యోతి బా పూలే అని ఆయన సేవలను మరువలేము. మనమందరం ఆయన ఆశయ సాధనకు, సిద్ధాంతా



లకు అనుగుణంగా ప్రతి ఒక్కరు వారిని ఆదర్శంగా తీసుకుని వారి అడుగుజాడల్లో నడుచుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ సభ్యులు అధ్యక్షులు కే హరినాథ్, మహిళా అధ్యక్షురాలు కే సుజాత, జనరల్ సెక్రెటరీ డి మాలతి, మండల్ మహిళా ప్రెసిడెంట్ మాధవి, లావణ్య శిరీష, అరుణ, ప్రసాద్, అనిల్ , జయరాం,రాజు,ఎడ్ల కాడి సూర్యం, తలారి చిన్న, రమేష్, అమర్ రెడ్డి, శంకర్ రెడ్డి, దళిత బహుజన నాయకులు కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

- మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు
- కాంగ్రెస్ అరాచకాలకు అడ్డుకట్ట వేయాలి
- మంచిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన చైర్మన్, కౌన్సిలర్లకు, సర్పంచులకు, మాజీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బీఆర్ఎస్ చైర్మన్, కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు.ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సమావేశంలో మాజీ మంత్రివర్యులు సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, యువనాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి), సత్తు వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. అనంతరం, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి జన్మదినం సందర్భంగా, కేటీఆర్ సమక్షంలో కేక్ కట్ చేసి ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న



అరాచకాలు, ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా విమర్శించారు. రాబోయేది టిఆర్ఎస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని కేటీఆర్ అన్నారు. అదేవిధంగా మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) పట్టుదల, ప్రజా నిబద్ధత కలిగిన యువ నాయకులు చట్టసభల్లోకి అడుగుపెట్టాల్సిన సమయం ఆసన్నమైంది" అని పేర్కొంటూ, ఆయన నాయకత్వాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు.మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు జరుగుతుందని, రాబోయే రోజుల్లో టిఆర్ఎస్ పార్టీ కేటీఆర్ నాయకత్వంలో అధికారంలోకి తప్పకుండా రావడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సర్పంచ్లు, రాష్ట్ర జిల్లా పార్టీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాల పెరుగుదలపై చర్చలు జోరందుకున్నాయి

**బూర్గంపాడు – భద్రాచలం భవిష్యత్‌పై ఆసక్తి**

**బూర్గంపహాడ్ మహా :** రాష్ట్రంలో నియోజకవర్గాల సంఖ్య పెంపుపై చర్చలు వేగంగా జరుగుతుండగా, రాజకీయ వర్గాల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాలు రాబోయే రోజుల్లో పెరిగే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం రాజకీయంగా కొత్త ఊపును తెచ్చింది.ప్రత్యేకంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ అంశంపై విస్తృతంగా చర్చ సాగుతోంది. గతంలో నియోజకవర్గ పునర్విభజనలో కొన్ని ప్రాంతాలు తమ ప్రాధాన్యత కోల్పోయిన నేపథ్యంలో, ఈసారి జరిగే మార్పులతో పూర్వ వైభవం తిరిగి వస్తుందా అనే ఆశలు వ్యక్తమవుతున్నాయి.బూర్గంపాడు మండలం విషయంలో ఈ చర్చ మరింత ఆసక్తికరంగా మారింది. గతంలో రాజకీయంగా ప్రాముఖ్యత కలిగిన ఈ ప్రాంతం, విభజన తర్వాత కొంత వెనుకబడినట్లు భావిస్తున్న స్థానికులు, మళ్లీ బూర్గంపాడుకు ప్రత్యేక గుర్తింపు వస్తుందా అనే ఆశతో ఎదురుచూస్తున్నారు. "బూర్గంపహాడ్ మహర్దశ" వస్తుందా అన్న చర్చలు గ్రామస్థాయిలోనే కాకుండా రాజకీయ వర్గాల్లోనూ వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో భద్రాచలం నియోజకవర్గ పరిధిలో కొన్ని పంచాయతీలు మార్పు చెందే అవకాశాలపై కూడా ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. ఆ ఐదు పంచాయతీలు భద్రాచలం నియోజకవర్గంలోకి



చేరుతాయా? లేదా కొత్తగా ఏర్పడే నియోజకవర్గంలో భాగమవుతాయా? అన్నది ఆసక్తికరంగా మారింది.నియోజకవర్గాల పెంపు జరిగితే రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కొత్త నాయకులకు అవకాశాలు రావడం, పాత నాయకుల ప్రభావం మారడం, పార్టీల వ్యూహాలు కొత్తగా రూపొందడం వంటి పరిణామాలు చోటుచేసుకునే అవకాశముంది.అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలూ ఈ అంశంపై ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. భవిష్యత్ ఎన్నికల దృష్ట్యా నియోజకవర్గాల పునర్విభజన కీలక పాత్ర పోషించనుంది.అయితే, ఈ విషయంపై ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ, జరుగుతున్న చర్చలు మాత్రం రాజకీయ వేడి పెంచుతున్నాయి. బూర్గంపాడు, భద్రాచలం ప్రాంతాల భవిష్యత్ ఎలా ఉండబోతుందన్నది రాబోయే నిర్ణయాలపై ఆధారపడి ఉంది.



## కేటీఆర్‌ను కలిసిన బద్రీనాథ్ గుప్తా

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా: శనివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి విచ్చేసిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసిన, బీఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం యువజన విభాగం అధ్యక్షుడు వనపర్తి బద్రీనాథ్ గుప్తా, ఆయనను శాలువతో సన్మానించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## పూలే జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**

**కుషాయిగూడ, మహా :** మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి ఉత్సవాలు సైనిక్పురి చౌరస్తాలో తిరుపతయ్య న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు కోరుకొండ అవినాష్, మల్లేష్ వంశరాజ్, యాట భాస్కర్, పెంచాల సురేందర్, చిత్తారి ముదిరాజ్, రాజేష్ వంశారాజు, ఎస్.ఏ. రహీం, కుమారస్వామి సమన్వయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, హైదరాబాద్ నగర తొలి మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, కొత్త రామారావు, గొల్లూరి అంజయ్య, శ్రవణ్, బిజెపి సీనియర్ నాయకుడు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. వివిధ సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన



నాయకులు మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలోని అంటరానితనం, కులవివక్ష నిర్మూలన కోసం నిరంతరం పోరాడిన మహానుభావుడని పేర్కొన్నారు. మహిళా విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషి అపారమని కొనియాడారు. దిగువ వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో సత్యశోధక్ సమాజాన్ని స్థాపించి సమాజంలో సమానత్వ భావన పెంపొందించేందుకు కృషి చేశారని గుర్తుచేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన పూలే, తన సహచరిణి సావిత్రిబాయి పూలేతో కలిసి మహిళా విద్యకు పునాది వేశారు అని వివరించారు. వారి ఆశయాలను కొనసాగిస్తూ సమాన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

# ఐదు గ్రామపంచాయతీల కోసం సమరభేరి

**సోమవారం భద్రాచలంలో భారీ సభ- హాజరుకానున్న రేణుకా చౌదరి**

**భద్రాచలం మహా :** ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని డిమాండ్ చేస్తూ సోమవారం భద్రాచలంలో భారీ సమరభేరి సభ నిర్వహించనున్నారు. ఈ సభకు మాజీ కేంద్ర మంత్రివర్యులు, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు తెలిపారు.రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన ఐదు గ్రామపంచాయతీల అంశంపై స్థానిక ప్రజల్లో అసంతృప్తి కొనసాగుతోంది. వాటిని తిరిగి తెలంగాణలో చేర్చాలని ప్రజలు, వివిధ సంఘాలు ఎన్నో రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ సమస్యను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు జరిగే సమరభేరికి ఆమె హాజరవుతున్నారు భారీ సంఖ్యలో ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు పాల్గొనాలని ఆయన తెలిపారు.ఈ సభలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై కీలక నిర్ణయాలు ప్రకటించే అవకాశం





ఉందని సమాచారం. భద్రాచలం ప్రాంతంలో ఈ సభకు రాజకీయ ప్రాధాన్యం నెలకొంది.

# కారేపల్లి సంత ఆదివారం యాధాతదం

**పంచాయతీ పాలకవర్గంతో దేవాదాయశాఖ చర్చలు**

**కారేపల్లి , మహా:** కారేపల్లిలో ఆదివారం నిర్వహించే సంత నిర్వాహణపై చింత తీరింది. శనివారం సింగరేణి పంచాయతీ పాలవర్గం, దేవదాయశాఖ, గ్రామ పెద్దలు సమక్షంలో జరిగిన చర్చలు ఫలప్రదం కావటంతో 12వ తేది ఆదివారం జరిగే సంత యధావిధిగా కొనసాగించుకోవచ్చని సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్ (టోనీ) తెలిపారు. 2014 నుండి గ్రామపంచాయతీకి సంత ఆదాయంలో 15 శాతం ఇవ్వాలని గ్రామపంచాయతీ కార్యదర్శి బీ .నెహ్రూ నోటీసు జారీ చేయటంతో పాటు 12వ తేదిన సంతను బంద్ చేయాలని దేవాదాయశాఖ అధికారులకు నోటీసు ఇచ్చారు. దీనిపై ఆలయం ఈవో కొండకింది



వేణుగోపాలచార్యులు స్పందించి పన్ను రాయితీ విషయం జిల్లా కలెక్టర్ దృష్టిలో ఉందని కలెక్టర్ ఉత్తర్వులు వచ్చే వరకు సంతను సాగనీయాలని కోరుతూ పంచాయతీకి లేఖ రాశారు. దీనిపై పాలవర్గం చర్చించి సంతను కొనసాగటానికి అనుమతి ఇచ్చారు.

### యువకులను లక్ష్యంగా చేసుకున్న
# దోపిడీ ముఠా అరెస్ట్




**కుషాయిగూడ, మహా :** కీసర మండలంలో పోలీసుల చాకచక్యంతో ఆరుగురు సభ్యుల దొంగల గ్యాంగ్‌ను అరెస్ట్ చేశారు. మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన శనివారం మీడియా సమావేశంలో డీసీపీ శ్రీధర్ వివరాలు వెల్లడించారు.నాలుగు రోజుల క్రితం బాధితుడిపై దాడి చేసి బంగారం, వాహనం, మొబైల్ ఫోన్లు అపహరించిన ఘటనపై కేసు నమోదు కాగా, వెంటనే దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఆరు మొబైల్ ఫోన్లు, ఒక కారు, ఒక స్కూటీ, సుమారు 15 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు.ఏడుగురు నిందితుల్లో ఒకరు పరారీలో ఉండగా, మిగతా ఆరుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితులు గతంలో అబ్దుల్లాపూర్‌మెట్, ఘట్‌కేసర్, కీసర ప్రాంతాల్లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఇంటర్నెట్ ద్వారా పరిచయాలు పెంచుకుని యువకులను లక్ష్యంగా చేసుకుని, వారి వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించి బెదిరింపులకు పాల్పడుతూ సొమ్ము







దోచుకునే విధానాన్ని అనుసరిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.ఈ నేపథ్యంలో యువత అపరిచితులతో పరిచయాల్లో జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ లక్ష్యం..ప్రజా సంక్షేమం

**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**బెల్లంపల్లి మహా:** కాంగ్రెస్ పార్టీ లక్ష్యం ప్రజా సంక్షేమమేనని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పేర్కొన్నారు.శనివారం రోజు ఎమ్మెల్యే సమక్షంలో మైలారం ఉప సర్పంచ్ "కొమ్ము హరీష్" తోపాటు ఆయన అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తుందని అన్నారు.మైలారం గ్రామ అభివృద్ధికి అవసరమైన ప్రతి పనికి తాము అండగా ఉంటామని,పార్టీలో చేరిన ప్రతికార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారుఅనంతరం మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ ఉపాధ్యక్షులు బొమ్మెన హరీష్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతికార్యకర్త కృషిచేయాలని పిలుపునిచ్చారు,గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలంగా నిర్మించేందుకు అందరూ కలిసి పనిచేయాలన్నారు.అనంతరం ఉప సర్పంచ్ కొమ్ము హరీష్



మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలుపరుస్తున్న పథకాలతో ప్రజలకు విశేష ప్రయోజనం కలుగుతోందని తెలిపారు.ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆధ్వర్యంలో మైలారం గ్రామాన్ని మరింత అభివృద్ధి పరచేందుకు కృషి చేస్తామన్నారు.ఈకార్యక్రమంలో మైలారం గ్రామ అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ ,బొమ్మెన రాజా గౌడ్, సందీనవేణి రామయ్య, గురునాథం నాగరాజు గౌడ్,గడ్డం సాయికుమార్ గౌడ్,మంచర్ల సతీష్,మంచర్ల రవి,కౌటారపు సంతోష్, మంచర్ల ప్రవీణ్, తోకల కిష్టయ్య సందీనవేణి రమేష్, జెడ మల్లేష్, కొమ్ము రమేష్ ఇతర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని షంషీర్ నగర్ కు చెందిన కొల్లూరి శంకర్ కుటుంబానికి శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల పదవ తరగతి పూర్వ విద్యార్థులు చేయూతనందించారు.ఈ నెల 7న బెల్లంపల్లిమండలంలోని తాళ్ల గురిజాల గ్రామ పంచాయతీ లంబడి తండా శివారులోని చెరువులో ఈతకు వెళ్లి శంకర్ కుమారుడు కొల్లూరి రాజేష్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు రూ.17,500 సమకూర్చారు. పూర్వ విద్యార్థుల ప్రతినిధులు దామెర విజయ్, ఒద్ది రాజేశం వసీమ్ లు నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.

# విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**బెల్లంపల్లి, మహా:** విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా వెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెల్లడించారు. శనివారం రోజు ఆయన బెల్లంపల్లి మండలంలోని నూతనంగా నిర్మించిన కేజీబీవీ జూనియర్ కళాశాలలో ఆధునిక సదుపాయాలతో కూడిన ల్యాబ్‌తో పాటు తరగతి గదులను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఘనంగా ప్రారంభించారు. రూ.2 కోట్లు 30 లక్షల వ్యయంతో నిర్మించిన ల్యాబ్, తరగతి గదులు విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించనున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణప్రాంతాల విద్యార్థులకు కూడా పట్టణ స్థాయి సౌకర్యాలు అందించడం లక్ష్యమని తెలిపారు.ఆధునిక పరికరాలతో ఏర్పాటుచేసిన ల్యాబ్‌తో విద్యార్థులు ప్రాయోగిక జ్ఞానాన్ని పెంపొందించుకుని శాస్త్ర, సాంకేతికరంగాలలో ముందంజ వేయాలని ఆకాంక్షించారు.నూతనంగా నిర్మించిన తరగతి గదులు విద్యార్థులకు అనుకూలమైన అభ్యాస వాతావరణాన్ని అందిస్తాయన్నారు.సంవత్సరం నర క్రితం భవనానికి భూమిపూజనిర్వహించామని గుర్తు చేసుకుంటూ,తక్కువ కాలంలోనే నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.భవిష్యత్తులో కూడా విద్యాసంస్థల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఇఓ యాదయ్య ,ప్రిన్సిపాల్ సంబంధిత అధికారులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్ , సర్పంచులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతి ఖని లాంగ్ వాల్ మైన్ ప్రాజెక్టును సందర్శించిన టిఎన్టియుసి




**బెల్లంపల్లి, మహా:** శాంతి ఖని లాంగ్ వాల్ మైన్ ప్రాజెక్టును శనివారం నాడు సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ (టిఎన్టియుసి) నాయకులు సందర్శించారు.ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టి.మణి రాంసింగ్ మాట్లాడుతూసింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ (టి ఎన్ టి యు సి)నాయకులు బాయి బాటలో భాగంగా శాంతి ఖని లాంగ్వా ల్ మైన్ ప్రాజెక్టును మొదటి షిఫ్ట్ లో సందర్శించి కార్మికులతో గని మేనేజర్ ఏజెంట్ గార్లతో గని భవిష్యత్తు గురించి చర్చించడం జరిగింది. అపారమైన బొగ్గు నిల్వ లు ఉన్నప్పటికీ భూగర్భ పరిస్థితుల నేపథ్యంలో, వేల కోట్లు ఖర్చు చేసిన సీఎంఆర్, బోల్టర్ మైనర్ లాంటి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కూడా గనిలో పనిచేయకపోవటం, అధికారుల సర్వే అంచనాల లోపం కారణంగా, ఒక్క బొగ్గు పెళ్లా బయటికి రాని పరిస్థితి నెలకొంది, ఈ నెపాన్ని కార్మికులపై నెట్టివేసి కార్మికుల్ని నిందారోపణ చేసి అధికారుల లాలుచి తమ విఫల ప్రయత్నాల నుండి బయటపడడానికి ప్రయత్నిస్తున్నారనీ ఆరోపించారు.గని నడపటానికి సాంకేతికంగా మరో టన్నెల్ బొదుగ తీసి అక్కడినుండి ఎస్ డి ఎల్ యంత్రాలను వినియోగించి మళ్లీ 10 ,15 సంవత్సరాలు నడిపే భవిష్యత్తు ఉన్నప్పటికీ, లేదా 43వ డీప్, కూడా ఎస్ డి ఎల్ పెట్టి నడిపించే అవకాశం ఉన్నప్పటికీ అపసోపాలు పడుతూ, ఆయా ఏరియాలో పనిచేసే కార్మికులకు కనీసం నీటి వసతి కూడా కల్పించకుండా కార్మికులపై కక్ష సాధింపు చర్యలు చేస్తూ కాలక్షేపం చేయడానికి తప్ప గని వల్ల సింగరేణి సంస్థకు ఒన గోరింది ఏమీ లేదనేది ఇన్నిసంవత్సరాలుగా పనిచేస్తున్న ,పని చేయిస్తున్న అధికారులకు తెలిసినటువంటి సత్యమేనని పేర్కొన్నారు.ఇప్పటికే క్రమంగా మ్యాన్ పవర్ తగ్గిస్తూ, బదిలీలు చేస్తూ, క్రమంగా కాంట్రాక్టీకరణ చేయటానికి యాజమాన్యం ప్రయత్నిస్తున్నదని, అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందడం ద్వారా యాంత్రికరణతో గనికి వైభవాన్ని తీసుకువచ్చే అవకాశాలు ఉన్నపటికీ యాజమాన్యానికి గని అధికారులకు చిత్త శుద్ధి లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం ఇప్పటికైనా శాంతి కనిపై ఖచ్చితమైన దృష్టి పెట్టి భూగర్భంలో ఉన్న వేలాది కోట్ల రూపాయల బొగ్గు నిలువలను వెలికి తీయడానికి తగిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులు కాలక్షేపానికి కాకుండా, గని బొగ్గు నిల్వలు బయటికి తీయడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడానికి గని భవిష్యత్తును నిర్దేశించడానికి తమ చిత్తశుద్ధిని ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. సీఎంఆర్, బోల్టర్ మైనర్, లాంటి అత్యాధునిక మిషనరీ తీసుకువచ్చి ఎటువంటి ఉపయోగం లేకుండానే వేలాది కోట్ల రూపాయలు, కార్మికుల కష్టార్జితాన్ని ఖర్చుచేసిన అధికారులపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎల్ యు టి ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి గద్దెల నారాయణ,ఎస్సీఎల్ యు ఉపాధ్యక్షులు శాంతికాని ఫిట్ కార్యదర్శి గడిపల్లి శంకర్, ఎస్ హరిబాబు, ఎస్ ఎస్ పాండే, గైని తిరుపతి, బి కుమార్, ఎం గోపాల్, బి సత్యనారాయణ, మేకల నర్సింగ్, కార్మిక నాయకులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హైవేలపై డీజిల్ దొంగలు..

- నల్లగొండలో అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్..
- ఆరుగురు నిందితుల అదుపులోకి, ఒకరు మైనర్..
- రూ. 40 లక్షల విలువైన సొత్తు స్వాధీనం..




**నల్లగొండ, మహా :** జాతీయ రహదారుల వెంట ఆగి ఉన్న వాహనాలే లక్ష్యంగా అర్ధరాత్రి వేళ డీజిల్ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును నల్లగొండ జిల్లా పోలీసులు రట్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈ ముఠా సభ్యులు గత కొంతకాలంగా రాత్రి సమయాల్లో హైవేలపై లారీలు, ట్రక్కుల నుంచి డీజిల్‌ను తోడేస్తూ వాహనదారులను బెంబేలెత్తిస్తున్నారు. శనివారం చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ భారీ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను జిల్లా అదనపు ఎస్పీ జి.రమేష్ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా హైవేలపై వరుసగా జరుగుతున్న డీజిల్ దొంగతనాలను అరికట్టేందుకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఈ క్రమంలో చిట్యాల పోలీసులు మరియు సీసీఎస్ బృందాలు నిఘా పెంచగా శుక్రవారం రాత్రి హైవేపై అనుమానాస్పదంగా నిలిపి ఉంచిన ఒక డీసీఎం వాహనం పోలీసుల కంటపడింది. ఆ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా పైన వడ్ల పట్టాలు కప్పి లోపల రహస్యంగా డీజిల్ నింపిన క్యాన్లను దాచిపెట్టినట్లు గుర్తించారు. డ్రైవర్ బాలకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించగా పక్కా ప్రణాళికతో సాగుతున్న ఈ ముఠా భాగోతం బయటపడింది. సమాచారం అందుకున్న పోలీసులు మరో డీసీఎం వాహనంతో పాటు మొత్తం ఆరుగురు సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో పల్నాడు జిల్లాకు చెందిన ముదావత్ గాంధీ నాయక్, ముదావత్ వెంకటేశ్వర్లు, బనావత్ తుల్య, ముదావత్ బాలకృష్ణ, రామవత్ వాగ్యలతో పాటు ఒక మైనర్ బాలుడు ఉన్నారు. నిందితులు తొలుత హైవేలపై డ్రైవర్లు నిద్రపోతున్న వాహనాలను గుర్తించి, క్షణాల్లో ట్యాంకులు పగులగొట్టి డీజిల్‌ను తమ వాహనాల్లోకి మార్చుకునేవారని పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 40 లక్షల విలువైన 1000 లీటర్ల డీజిల్, రెండు డీసీఎంలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గతంలో తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా కేసులు ఉన్నట్లు తేలింది. ఈ దొంగతనాల ముఠాను చాకచక్యంగా పట్టుకున్న డీఎస్పీ శివరాం రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు జితేందర్ రెడ్డి, నాగరాజు మరియు ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి నగదు పురస్కారాలను ప్రకటించారు. హైవేలపై ప్రయాణించే వారు అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## గ్రామీణ మేధస్సుకు ఇన్నోవేషన్ ఊతం..

- నల్లగొండ ఐటీ టవర్‌లో 'ఇన్నోవేషన్ పంచాయత్'..
- తరలివచ్చిన ఉమ్మడి జిల్లా ఆవిష్కర్తలు..
- మార్గదర్శకత్వం వహించిన హైదరాబాద్ నిపుణులు..






**నల్లగొండ, మహా :** మారుమూల గ్రామాల్లోని వినూత్న ఆలోచనలకు రెక్కలు తొడిగి వాటిని విజయవంతమైన వ్యాపారాలుగా మార్చేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. శనివారం నల్లగొండలోని ఐటీ టవర్‌లో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ (టీజీఐసీ) ఆధ్వర్యంలో 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. నల్లగొండతో పాటు యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల నుంచి సుమారు 60 మందికి పైగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, గ్రామీణ ఆవిష్కర్తలు తమ సరికొత్త ఆలోచనలతో ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. రాజధానిలోని స్టార్టప్ సంస్కృతిని జిల్లాలకు చేరువ చేయడమే లక్ష్యంగా సాగిన ఈ భేటీలో.. హైదరాబాద్‌కు చెందిన 12 మంది అగ్రశ్రేణి మెంటార్లు ఆవిష్కర్తలకు మార్గదర్శకత్వం వహించారు. వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణహిత ఇంధన వనరుల రంగాల్లో స్థానిక యువత రూపొందించిన నమూనాలను (ప్రోటోటైప్స్) నిపుణులు పరిశీలించారు. నిధుల సమీకరణ, మార్కెటింగ్ మెళకువలు, వ్యాపార విస్తరణలో ఎదురయ్యే సవాళ్లపై ఆవిష్కర్తలకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు.

**నల్లగొండలో టీజీఐసీ కేంద్రం ఉండాలి.. కలెక్టర్**

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కేవలం ఆలోచనలు ఉండటమే కాకుండా వాటిని ఆచరణలోకి తెచ్చే స్పష్టత ఉన్నప్పుడే విజయం సాధ్యమన్నారు. నల్లగొండ జిల్లా విద్యా కేంద్రంగా మారుతున్న నేపథ్యంలో ఇక్కడి యువతకు నిరంతరం తోడ్పాటు అందించేందుకు ఐటీ టవర్‌లో టీజీఐసీ తన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. హైదరాబాద్‌లోని టెక్ హబ్‌ల తరహాలోనే జిల్లాల్లోనూ ఆవిష్కరణల నాడి బలంగా ఉందని టీజీఐసీ సీఈఓ మెరాజ్ ఫహీమ్ అభివర్ణించారు. సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతతో జోడించి స్థానిక ఆవిష్కర్తలు అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. గ్రామీణ ఆవిష్కరణలకు ప్రభుత్వ మద్దతును నేరుగా అందించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐసీ బృందం, స్థానిక అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు పాల్గొన్నారు.

## మత్తు వీడి కొత్త జీవితం ప్రారంభించండి..

**నల్లగొండ కలెక్టర్ బి.చంద్రశేఖర్**






**నల్లగొండ టౌన్, మహా :** మత్తు పదార్థాల బారిన పడిన వారికి మెరుగైన చికిత్స అందించి, వారిని తిరిగి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని మత్తు విముక్తి విభాగాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, కౌన్సెలింగ్ విధానం మరియు మందుల పంపిణీ తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సెంటర్ ఇంచార్జ్ డాక్టర్ అనిల్‌తో మాట్లాడి బాధితులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అవసరమైన అన్ని వైద్య వసతులు కల్పిస్తున్నామని, కౌన్సెలింగ్‌తో పాటు ప్రత్యేక మెడికల్ చికిత్స అందిస్తూ వారిని శ్రద్ధగా చూసుకుంటున్నామని వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా ముఖాముఖి నిర్వహించి వారిలో ధైర్యం నింపారు. కత్తుల శేఖర్ అనే బాధితుడితో మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. అలాగే శాలీలింగోటం గ్రామానికి చెందిన పరుష రాముడు తన వ్యక్తిగత సమస్యల వల్ల మద్యానికి బానిసయ్యానని తెలపగా సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలే తప్ప మత్తులో మునిగిపోకూడదని కలెక్టర్ సూచించారు. జిల్లాలో త్వరలోనే ప్రత్యేక డీఅడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. వ్యసనాల నుంచి బయటపడాలనుకునే వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రమేష్, డ్రగ్స్ ఇన్స్పెక్టర్ సంపత్, డీఎస్పీ శివరాం రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ నేత నరసింహారావు, ఇంచార్జ్ డాక్టర్ జోష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయ విగ్రహ స్థాపన రెండో రోజు పూజలు...

**శ్రీశ్రీశ్రీ మాడుగుల సర్వోత్తమ శర్మ బృందం...**



**సదాశివపేట :మహా :** స్థానిక శ్రీ సంగమేశ్వర మందిరంలో రెండవ రోజు దత్తాత్రేయ విగ్రహ స్థాపన పూజలు శ్రీశ్రీశ్రీ మాడుగుల సర్వోత్తమ శర్మ బృందం పూజారుల సారధ్యంలో ఆలయ కమిటీ పూజారులు మోహన్ రావు. బియన్ శంకరరావు. నారాయణ రావుల ఆధ్వర్యంలో శనివారం ఆవహిత దేవత పూజ అష్టోత్తర శత 108. కళాశాల తో మహా స్నాపనం ఆవాహిత దేవత మూలమంత్ర హోమం. అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు కోనసీమ జిల్లా వాస్తవ్యులు కృష్ణమూర్తి సౌజన్యంతో అన్న ప్రసాద వితరణ. సాయంత్రం 5 గంటలకు స్వామివారికి ధాన్యాధివాసం. పుష్పాదివాసం ఫలాదివాసం. శషయాదివాసం. తదుపరి ప్రదోష పూజ చత్రువేద సేవ, మంగళహారతి మంగళ హారతి. మంత్రపుష్పం పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదా వితరణ ఎనిమిది గంటలకు భద్రాచల భాగవ తార్ గారిచే దత్త భజన హరికథ శ్రవణం. రాత్రి 10 గంటలకు భజన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భజన భక్త బృందం మల్లికార్జున పూర్ణచందర్ మాజీ కౌన్సిలర్ ఆకుల శివకుమార్. మారేపల్లి చిన్న శివకుమార్. ముంగి మల్లేశం. రాజన్న స్వామి. రామ్ రెడ్డి. వడ్ల పరమేష్. సుధాకర్. సుబ్రహ్మణ్యం.మణికంఠ. సుబ్రహ్మణ. ప్రభు . తదితర భక్త బృందం పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే...

**పూలే 199వ జయంతి ఉత్సవాల్లో**

**విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ...**








**సదాశివపేట : మహా :** బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు.శనివారం ఆయన జయంతి సందర్భంగా. సదాశివపేట పట్టణం లోని విగ్రహానికి పూలమాలలుసమర్పించి నివాళులుఅర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సామాజిక న్యాయం, విద్యా ప్రాధాన్యత కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, ప్రధాన కార్యదర్శి వీరేశం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్ ,కౌన్సిలర్ లు నసీర్, నాగుల మానెమ్మ, విజయ్ , నాయకులు ముబీన్, ఖాజా ,లతీఫ్, రాజు, జబ్బర్, ప్రవీణ్ ,వాహబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**నివాళులర్పించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ,ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**




**యాదాద్రి భువనగిరి, మహా:** మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి వేడుకలు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జగ్దేవ్‌పూర్ చౌరస్తా వద్ద వున్న జ్యోతిరావు పూలే విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ,భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.సమాజంలో అణగారిన వర్గాలకు విద్య, సమానత్వం, హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే సేవలు దేశానికి అమూల్యమైనవని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గం సామాజిక న్యాయం కోసం కృషి చేసే ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు.మహాత్మా పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమానత్వ సమాజ నిర్మాణానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## శోభనాద్రిపురంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**సర్పంచ్ కంచి మధుసూదన్**

**భువనగిరి, మహా:** రామన్నపేట మండలంలోని శోభనాద్రిపురం గ్రామంలో సర్పంచ్ కంచి మధుసూదన్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పాలకవర్గం శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో గ్రామపంచాయతీ సభ్యులు ముక్క మాల సతీష్ జంగిలి రమణ ఎండి లతీఫ్ తాడూరి అంజమ్మ కంచి కుమారస్వామి కంచి స్వామి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## పూలే ఆశయాలతోనే సామాజిక మార్పు..




- ఘనంగా మహాత్ముని 200వ జయంతి ఉత్సవాలు..
- విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట.. కలెక్టర్ బి.చంద్రశేఖర్
- క్లాక్ టవర్ వద్ద నివాళులర్పించిన ప్రముఖులు..

**నల్లగొండ, మహా :** సమానత్వం సామాజిక న్యాయం మరియు నాణ్యమైన విద్య కోసం పోరాడిన మహాత్మ జ్యోతిబాపూలే ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన పూలే 'ద్విశతాబ్ది' జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాల విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. విద్యా విప్లవంలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున రూ. 200 కోట్ల వ్యయంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్' పాఠశాలలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. వీటిలో ఒక్కో పాఠశాలలో 2,600 మంది విద్యార్థులు చదువుకోవచ్చని, అలాగే ప్రతి నియోజకవర్గానికి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జిల్లాలో ఓవర్సీస్ విద్యానిధి కింద 12 మందికి కులాంతర వివాహాల పథకం కింద 21 మందికి ఆర్థిక సాయం అందించామన్నారు. విద్యార్థులు 'ప్రశ్నించే మనస్తత్వాన్ని' అలవాటు చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పూలే కేవలం సంఘసంస్కర్త మాత్రమే కాదని, దేశంలో మహిళా విద్య కోసం పునాదులు వేసిన మహనీయుడని కొనియాడారు. ఎమ్మెల్సీ నెలకుంటి సత్యం మాట్లాడుతూ.. 200 ఏళ్ల క్రితమే కుల వివక్షకు వ్యతిరేకంగా పూలే పోరాటం చేశారని, నేటికీ కొనసాగుతున్న కుల వ్యవస్థ నిర్మూలనకు ఆయన ఆదర్శమని పేర్కొన్నారు. విద్యా రంగానికి ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా క్లాక్ టవర్ చౌరస్తా నుంచి కలెక్టర్ ఆధ్వర్యంలో 'నో డ్రగ్స్ క్యాంపెయిన్' ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నెలికంటి సత్యం, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి , డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, విశ్రాంత ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్, అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఏఎస్పీ రమేష్, బీసీ సంక్షేమ శాఖ అధికారి సంజీవ మరియు వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఎస్ ఎవరికీ వ్యతిరేకం కాదు

- హిందూ సమాజాన్ని ఏకం చేసే సాధనం
- హెడ్గేవార్ ఒక మహోన్నతమైన ఆలోచనా విధానం
- కందకుర్తి దేశభక్తిని నేర్పే పాఠశాల
- సమాజంలో సమరసత నెలకొన్నప్పుడే.. అజేయమైన శక్తిగా భారతదేశం
- సంఘ్ అధినేత (సరసంఘచాలక్) డాక్టర్ మోహన్ భాగవత్



**హైదరాబాద్, మహా:** జాతీయవాదమే శ్వాసగా, సమాజ నిర్మాణమే ధ్యేయంగా వందేళ్ల క్రితం మొలకెత్తిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల వేళ.. ఆ మహా వృక్షానికి బీజం వేసిన డాక్టర్ కేశవ బలిరామ్ హెడ్గేవార్ మూలాలైన కందకుర్తిలో సరికొత్త జాతీయ స్ఫూర్తి రగులుకుంది. గోదావరి, మంజీర, హరిద్ర నదుల పవిత్ర త్రివేణి సంగమ క్షేత్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 'శ్రీ కేశవ స్ఫూర్తి మందిరాన్ని' సంఘ్ అధినేత (సరసంఘచాలక్) డాక్టర్ మోహన్ భాగవత్ శనివారం జాతికి అంకితం చేశారు. ఆర్ఎస్ఎస్ ఏ ఒక్కరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేసిన ఆయన.. హెడ్గేవార్ కేవలం ఒక వ్యక్తి కాదని, దేశాన్ని అజేయ శక్తిగా నిలబెట్టే ఓ మహోన్నత ఆలోచనా విధానమని ఉద్ఘాటించారు. దేశభక్తిని నూరిపోసే పాఠశాలగా మారనున్న కందకుర్తి వేదికగా సమాజంలో సమరసత ఆవశ్యకతను ఆయన కుండబద్ధలు కొట్టారు* నిజామాబాద్ జిల్లాలోని త్రివేణి సంగమ క్షేత్రం కందకుర్తి ఒక మహాద్భుత చారిత్రక ఘట్టానికి సాక్షీభూతంగా నిలిచింది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల వేళ, ఆ మహా వృక్షానికి బీజం వేసిన వ్యవస్థాపకులు డాక్టర్ కేశవ బలిరామ్ హెడ్గేవార్ పూర్వీకుల పవిత్ర గడ్డపై నిర్మించిన 'శ్రీ కేశవ స్ఫూర్తి మందిరం' ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. దశాబ్దాల కాలంగా వేలాది మంది సంఘ్ కార్యకర్తలు కన్న కల నేడు వాస్తవరూపం దాల్చడంతో కందకుర్తి పరిసర ప్రాంతాలన్నీ కాషాయ ధ్వజాల నీడన జాతీయ భావంతో ప్రతిధ్వనించాయి. అత్యంత భక్తిశ్రద్ధలు, వేద మంత్రోచ్చారణల నడుమ ఆర్ఎస్ఎస్ సరసంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ ఈ స్ఫూర్తి కేంద్రాన్ని స్వయంగా ప్రారంభించి యావత్ జాతికి అంకితం చేశారు. తన వ్యవస్థాపకుడి మూలాలను స్మరించుకుంటూ, భావి తరాలకు జాతీయ స్ఫూర్తిని, క్రమశిక్షణను అందించే లక్ష్యంతో నిర్మించిన ఈ కేంద్రం కేవలం ఒక భౌతిక కట్టడం మాత్రమే కాదని, ప్రతి భారత పౌరుడిలో దేశభక్తిని నింపే ఒక అఖండ శక్తి కేంద్రమని ఆయన అభివర్ణించారు. ఈ బృహత్తర కార్యక్రమం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో ప్రారంభమైంది. నూతనంగా నిర్మించిన స్ఫూర్తి కేంద్రంలో మోహన్ భాగవత్ తొలుత డాక్టర్ హెడ్గేవార్ విగ్రహాన్ని, అనంతరం భరతమాత విగ్రహాన్ని ఆవిష్కరించి, పుష్పమాలలు సమర్పించి అత్యంత భక్తిప్రపత్తులతో ప్రణామం చేశారు. అనంతరం స్ఫూర్తి కేంద్రం లోపల ఏర్పాటు చేసిన అరుదైన ఫొటో గ్యాలరీని ఆయన ఎంతో ఆసక్తిగా, తదేకంగా పరిశీలించారు. హెడ్గేవార్ జీవిత ప్రయాణం, సంఘ్ ఆవిర్భావ నేపథ్యం, దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన పోషించిన అనితర సాధ్యమైన పాత్రను కళ్లకు కట్టేలా తీర్చిదిద్దిన ఛాయాచిత్రాలను చూస్తూ గతాన్ని స్మరించుకున్నారు. సందర్శకుల పుస్తకంలో తన అమూల్యమైన సందేశాన్ని లిఖిస్తూ, కందకుర్తి యావత్ దేశానికి ఒక దిక్సూచిగా మారాలని ఆకాంక్షించారు. ఈ మహత్తర కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి, నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ శాసనసభ్యులు రాకేష్ రెడ్డితో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి ఆర్ఎస్ఎస్ ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొని జాతీయవాద భావజాలాన్ని చాటి చెప్పారు.అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మోహన్ భాగవత్ చేసిన ఉద్వేగభరిత ప్రసంగం ప్రతీ ఒక్కరిలోనూ దేశభక్తి జ్వాలను రగిలించింది. డాక్టర్ హెడ్గేవార్ జీవితాన్ని కేవలం ఒక సంస్థ పరిధిలో బంధించి చూడటం ఏమాత్రం తగదని, ఆయన భరత మాత విముక్తి కోసం కాంగ్రెస్ నాయకుడిగా, అజ్ఞాత విప్లవకారుడిగా బహుముఖ పాత్రలు పోషించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని గుర్తు చేశారు. ఆయన జన్మించింది మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో అయినప్పటికీ, ఆయన సిరల్లో ప్రవహించిన రక్తంలో తెలంగాణ నేల వాసన, కందకుర్తి సాంస్కృతిక వారసత్వం ఇమిడి ఉన్నాయని, అందుకే ఈ గడ్డకు అంతటి మహత్యం చేకూరిందని వ్యాఖ్యానించారు. హెడ్గేవార్ కేవలం ఒక సాధారణ వ్యక్తి కాదని, ఆయన ఒక గొప్ప ఆలోచనా స్రవంతి అని, హిందూ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి తన జీవితాన్ని గంధపు చెక్కలా అరిగించిన మహాత్ముడని ప్రశంసించారు. కులమతాలకు, అంతరాలకు అతీతంగా ప్రతి భారతీయుడు ఒకే తల్లి బిడ్డగా మెలగాలని, సమాజంలో సంపూర్ణ సమరసత నెలకొన్నప్పుడే మన దేశం ప్రపంచ పటంలో అజేయమైన శక్తిగా అవతరిస్తుందని ఆయన స్పష్టం చేశారు.సంఘం ఆవిర్భావం వెనుక ఉన్న అసలైన ఉద్దేశాలను, సిద్ధాంతాలను భాగవత్ తన ప్రసంగంలో మరోసారి కుండబద్ధలు కొట్టారు. ఆర్ఎస్ఎస్ ఎవరికీ వ్యతిరేకంగా ఏర్పడిన సంస్థ కాదని, ఇది కేవలం హిందూ సమాజాన్ని ఏకతాటిపైకి తెచ్చి, దేశాన్ని పునరుజ్జీవింపజేసే ఒక పవిత్ర సాధనమని ఆయన పునరుద్ఘాటించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా, నేటికీ సామాజిక సమరసత అత్యంత ఆవశ్యకమని, సంకుచిత స్వార్థ రాజకీయాలకు అతీతంగా జాతీయ ప్రయోజనాలే పరమావధిగా భావించాలని పిలుపునిచ్చారు. సుమారు పది కోట్ల రూపాయల భారీ వ్యయంతో రెండంతస్తుల్లో నిర్మించిన ఈ కేంద్రంలో అధునాతన మ్యూజియంతో పాటు వీడియో ప్రజెంటేషన్ హాల్ ఉండటం వల్ల సందర్శకులకు హెడ్గేవార్ జీవిత విశేషాలు సులభంగా అర్థమవుతాయని వివరించారు. ఈ క్షేత్రాన్ని ప్రతి భారతీయుడు సందర్శించి ఇక్కడి నుంచి స్ఫూర్తిని పొందాలని, ఇది కేవలం విహారయాత్ర కోసం వచ్చే పర్యాటక స్థలం కాదని, దేశభక్తిని నేర్పే గొప్ప పాఠశాల అని ఆయన అభివర్ణించారు. సభకు ముందు పురాతన కేశవ మూర్తి, విఠలేశ్వర ఆలయాలను భాగవత్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం ద్వారా ఈ ప్రాంత ఆధ్యాత్మిక ప్రాధాన్యతను కూడా నొక్కి చెప్పారు. కందకుర్తి పవిత్ర త్రివేణి సంగమం కావడంతో, ఇక్కడ స్ఫూర్తి కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్తులో భక్తులకు, లక్షలాది మంది స్వయంసేవకులకు ఇది ఒక పవిత్ర తీర్థయాత్ర క్షేత్రంగా మారడం ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తన వందేళ్ల చారిత్రక ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న తరుణంలో, వ్యవస్థాపకుడి మూలాల వద్ద ఇలాంటి భారీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం ద్వారా సమాజానికి ఒక స్పష్టమైన, బలమైన సందేశాన్ని పంపారు. డాక్టర్ హెడ్గేవార్ ఆశయాలకు అనుగుణంగా ప్రధాని మోదీ కలలుగంటున్న 'వికసిత భారత్' నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడమే ఆ మహానేతకు మనం ఇచ్చే అసలైన నివాళి అని సభను ముగించారు.

# హాలీవుడ్‌లో సత్తా చాటుతున్న తెలుగు, తమిళ భామలు!

ప్రస్తుతం అంతర్జాతీయ సినిమా రంగం (హాలీవుడ్)లో భారతీయ మూలాలున్న నటీమణుల ప్రభావం మునుపెన్నడూ లేని విధంగా పెరుగుతోంది. ఒకప్పుడు కేవలం చిన్న పాత్రలకే పరిమితమైన మన దక్షిణాది ములాలున్న నటులు, నేడు ప్రధాన పాత్రల్లో నటిస్తూ గ్లోబల్ స్టార్స్‌గా ఎదుగుతున్నారు. ముఖ్యంగా తమిళ మూలాలున్న వారు అక్కడ ఆధిపత్యం ప్రదర్శిస్తుండగా.. ఇప్పుడు ఆ జాబితాలోకి ఒక తెలుగు అమ్మాయి కూడా చేరింది. తమిళ మూలాలతో దుమ్మురేపుతున్న నటీమణులుహాలీవుడ్‌లో ప్రస్తుతం తమిళ మూలాలున్న భామల హవా స్పష్టంగా కనిపిస్తోంది. భాష ఏదైనా వారి వేర్లు మన దక్షిణాదివే కావడం విశేషం:



## మైత్రేయి రామకృష్ణన్:

నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'Never Have I Ever' తో ఈమె రాత్రికి రాత్రే గ్లోబల్ స్టార్ అయిపోయింది. శ్రీలంక తమిళ మూలాలున్న మైత్రేయి, ఇప్పుడు హాలీవుడ్‌లో అత్యధిక డిమాండ్ ఉన్న యువ నటీమణుల్లో ఒకరు.



## సైమన్ యాష్లే

హాలీవుడ్‌లో తమిళ మూలాలున్న మరో భామ సైమన్ యాష్లే సెన్సేషన్. 'బ్రిడ్జర్టన్', 'సెక్స్ ఎడ్యుకేషన్'వంటి వెబ్ సిరీస్‌లతో గ్లోబల్ స్టార్‌గా ఎదిగింది ఈ భామ.



## చరిత్రా చంద్రన్

నెట్‌ఫ్లిక్స్ హిట్ పీరియడ్ డ్రామా 'Bridgerton' (Season 2) లో ఎడ్వీనా శర్మగా నటించి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చుకుంది. ఈమె ఆక్స్‌ఫర్డ్ గ్రాడ్యుయేట్ కావడం మరో విశేషం.



## అంజనా వాసన్

'బ్లాక్ మిర్రర్' వంటి కల్ట్ సిరీస్‌లలో నటించి తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆమె స్టేజ్ నాటకాల్లోనూ ఆరితేరిన నటి.



## గెరాల్డిన్ విశ్వనాథన్:

'Blockers', 'The Broken Hearts Gallery' వంటి సినిమాలతో కామెడీలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తండ్రి మలయాళీ-తమిళ మూలాలున్న వ్యక్తి.



## అవంతిక వందనపు

ఇక తెలుగు నుంచి ఒక్కరైనా లేరా? అని ఎదురుచూస్తున్న అభిమానులకు సమాధానంగా నిలిచింది అవంతిక వందనపు. ఈమె కేవలం హాలీవుడ్‌లో అడుగుపెట్టడమే కాకుండా, పెద్ద పెద్ద ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతోంది. అవంతిక కుటుంబం హైదరాబాద్‌కు చెందింది. చిన్నప్పుడే అమెరికాలో స్థిరపడినప్పటికీ, తన నటనా ప్రయాణాన్ని టాలీవుడ్‌లోనే మొదలుపెట్టింది. 'బ్రహ్మోత్సవం'లో మహేష్ బాబు మేనకోడలిగా, 'ప్రేమమ్'లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా మెప్పించింది. డిస్నీ ఒరిజినల్ మూవీ 'Spin' లో ప్రధాన పాత్ర పోషించి హాలీవుడ్ దృష్టిని ఆకర్షించింది అవంతిక వందనపు. ఇక 2024లో విడుదలైన మ్యూజికల్ కామెడీ 'Mean Girls' ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. ఇందులో 'కరేన్ శెట్టి'గా ఆమె చేసిన కామెడీ టైమింగ్ అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఇటీవల విడుదలైన హారర్ థ్రిల్లర్ 'Tarot' లోనూ కీలక పాత్రలో మెరిసింది. గతంలో హాలీవుడ్ అంటే కేవలం విదేశీయులే ఉండేవారు. కానీ ఇప్పుడు కథల్లో వైవిధ్యం పెరగడం, భారతీయ పాత్రలకు ప్రాధాన్యత లభించడంతో మన వారు రాణిస్తున్నారు. తెలుగు నుంచి అవంతిక ఒక మార్గాన్ని సుగమం చేయగా, రాబోయే రోజుల్లో మరిన్ని తెలుగు ప్రతిభలు గ్లోబల్ స్క్రీన్‌పై మెరవడం ఖాయంగా కనిపిస్తోంది.



# బూతు కంటెంట్ ఊహించొద్దు

ఈ మధ్య ఇన్‌స్టాగ్రామ్‌లో సబ్‌స్క్రిప్షన్ గోల ఎక్కువైపోయింది. చాలామంది సబ్‌స్క్రిప్షన్ అనగానే అక్కడేదో బూతు కంటెంట్ ఉంటుందని భావిస్తున్నారు. తన దగ్గర మాత్రం అలాంటివి ఆశించొద్దంటోంది మలయాళ నటి అన్నా రేష్మ రాజన్. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. నా అకౌంట్‌లో సబ్‌స్క్రిప్షన్ మోడల్‌ను రెండేళ్ల క్రితమే ప్రారంభించాను. దాని ద్వారా మీ అందరితో కనెక్ట్ అయ్యాను. సబ్‌స్క్రిప్షన్ వల్ల నా రీల్స్, ఫోటోలు మీకు ముందుగానే వస్తాయి. అలాగే మీరు నాతో కాస్త ఎక్కువగా కనెక్ట్ అవొచ్చు. అంతే తప్ప సబ్‌స్క్రిప్షన్ అంటే అక్కడేదో బూతు కంటెంట్ ఉంటుందని కాదు. కేవలం క్వాలిటీ, సృజనాత్మకత, గౌరవప్రదమైన సంభాషణలు మాత్రమే ఉంటాయి. కాబట్టి దయచేసి మీరు ఏదో ఊహించి రాకండి. కేవలం వృత్తిపరమైన విషయాలు మాత్రమే ఉంటాయని మీకు క్లియర్‌గా చెప్తున్నా అని రాసుకొచ్చింది. ఇది చూసిన అభిమానులు మంచి పని చేశావని మెచ్చుకుంటున్నారు. కొందరు నెటిజన్లు మాత్రం.. నీ రీల్స్, ఫోటోలు ముందుగా చూడటానికి సబ్‌స్క్రిప్షన్ దేనికో? అని సెటైర్లు వేస్తున్నారు. కాగా నటి అన్నా రాజన్.. 2017లో 'అంగమలి డైరీస్' మూవీలో మలయాళ ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. అయ్యప్పనుమ్ కోషియుమ్ చిత్రంలో పృథ్వీరాజ్ భార్యగా నటించింది. మలయాళంలో పలు సినిమాలు చేసిన ఈ నటి ప్రస్తుతం జైలర్ 2లో నటిస్తోంది. తమిళంలో ఇదే తన తొలి సినిమా కావడం విశేషం!



# అక్కలా సలహాలు ఇస్తుంది

ఇండస్ట్రీలో హీరోయిన్ల మధ్య స్నేహాలు కామన్‌గానే కనిపిస్తాయి. అయితే, వాటిలోని ఎన్నో స్నేహాలు ఇద్దరూ కలిసి నటించడం వరకే కొనసాగుతాయి. ఆ తర్వాత అటకెక్కుతాయి. కానీ, తమన్నా భాటియాతో తన స్నేహం చిరస్థాయిగా నిలిచేదని అంటున్నది టాలీవుడ్ బ్యూటీ.. మృణాల్ ఠాకూర్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్.. తమన్నాతో స్నేహం గురించి చెబుతూ ఎమోషనల్ అయ్యింది. "నేను చిన్నప్పటి నుంచి అబ్బాయిలతోనే ఎక్కువగా ఉండేదాన్ని. అందుకే నాకు అమ్మాయిలతో స్నేహం చేయడం కొంచెం కష్టంగా అనిపించేది. మారిపోయింది. ఈ క్రమంలోనే తమన్నా నాకు అత్యంత సన్నిహితురాలిగా మారింది" అంటూ చెప్పుకొచ్చింది. తమన్నా తనకు అత్యంత ఆత్మీయురాలనీ, ఆమె మనసు ఎంతో స్వచ్ఛమైనదనీ తమన్నాపై ప్రశంసలు కురిపించింది. "మా ఇద్దరి మధ్య బాండింగ్ చాలా బాగుంటుంది. ఏ విషయాన్నైనా ఆమెతో నిర్మొహమాటంగా పంచుకుంటాను. తను కూడా ఒక అక్కలా నాకు సలహాలు ఇస్తుంది. జీవితాన్ని ఎలా ఎంజాయ్ చేయాలో నేర్పిస్తుంది. ఆమె సలహాలు నాకు ఎంతో ధైర్యాన్నిస్తాయి" అంటూ వెల్లడించింది. గతంలో వీరిద్దరూ కలిసి నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ 'లస్ట్ స్టోరీస్ 2'లో నటించారు. అప్పటి నుంచే మృణాల్‌తమన్నా మధ్య స్నేహం మరింత బలపడింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com